# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 29-6-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:258 పేజీలు:6 వెల: రూ.1/-


## షాద్‌నగర్ కంపెనీలో భారీ పేలుడు.. ముగ్గురు మృతి

హైదరాబాద్, జూన్ 28 :షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో శుక్రవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, 15 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. సౌత్ గ్లాస్ ప్రైవేట్ కంపెనీ ఫర్నేస్ విభాగంలో కంప్రెసర్ గ్లాస్ పేలడంతో మంటలు చెలరేగాయి.

మంటలు చెలరేగడంతో కార్మికులు, సిబ్బంది భయంతో బయటకు పరుగులు తీశారు. దట్టమైన పొగలు కమ్ముకోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

కాగా, ఈ ప్రమాదంలో గాయపడిన వారిలో పలువురి తలలు, కాళ్లపై గాయాలు గాయాలవ్వగా? చికిత్స పొందుతున్న వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. బాధిత కార్మికులంతా ఇతర రాష్ట్రాలకు చెందినవారని పోలీసులు పేర్కొన్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంనట్లు తెలిసింది. ఈ ఘటనపై షాద్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చురక

స్వోత్కర్ష పరనింద
సర్కారుకు కొత్తకాదు
చెంపదెబ్బ జనమేసిన
చిత్తంలో చెత్తపోదు
తమ పాలన దేశమంతా
తప్పులేవి చేయనట్లు
పర పార్టీ మంచి వదిలి
పాడు ఒకటే చూపుడెట్లు



-వేల్పుల నారాయణ
9440433475

## 4 రోజుల్లో రైతు రుణమాఫీపై మార్గదర్శకాలు : సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జూన్ 28 : రైతు రుణమాఫీపై నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పంట రుణాల మాఫీకి రేషన్ కార్డు ప్రమాణికం కాదని.. కుటుంబాన్ని గుర్తించడం కోసం మాత్రమేనని పేర్కొన్నారు. పాస్ బుక్ ఆధారంగానే రుణ మాఫీ ఉంటుందని తెలిపారు. రూ. 2లక్షల వరకు మాత్రమే రుణమాఫీ ఉంటుందని చెప్పారు. రాష్ట్ర ఖజానాకు ఆర్థిక భారం ఉన్న సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రైతు రుణమాఫీ తర్వాత రైతు బంధు ఇతర పథకాలపై దృష్టి పెడతామని వెల్లడించారు.

రాష్ట్రంలో విద్యుత్ కొరత లేదని.. పంపిణీలో మాత్రమే అంతరాయాలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తాము అధికారంలోకి వచ్చేనరికి ప్రతి ఏడాది జరిగే నిర్వహణ పనులు జరగడం వల్లే అంతరాయం ఏర్పడిందని చెప్పారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండు రోజుల్లో తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ఉంటాయని తెలిపారు. తెలంగాణ బడ్జెట్ వాస్తవ అంచనాలకు అనుగుణంగా ఉండాలని అధికారులకు చెప్పానని అన్నారు. అంచనాలకు మించి ఊహాజనిత లెక్కలకు మించి బడ్జెట్ ఉండకూడని అధికారులకు అదేశాలిచ్చానన్నారు.

మండలాలు, రెవెన్యూ డివిజన్ విషయంలో కమిషన్ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో చర్చించి బడ్జెట్ సమావేశాల తర్వాత కమిషన్ నియమిస్తామన్నారు. బీసీ కమిషన్ పదవీకాలం ఆగస్టుతో పూర్తవుతుందని.. కొత్త వారిని నియమించిన తర్వాత కుల గణన చేస్తామని చెప్పారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులపై దృష్టి సారించామని తెలిపారు. అన్ని శాఖలకు సంబంధించిన రాష్ట్ర మంత్రులు ఇప్పటికే కేంద్ర మంత్రులను ఒకసారి కలిశారని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌కు ముందే రాష్ట్రానికి కావాల్సిన అంశాలను కేంద్రం దృష్టిలో ఉంచి ఎక్కువ నిధులు పొందే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

## లోక్ సభ జులై 1కి వాయిదా

న్యూఢిల్లీ జూన్ 28 (ఎక్స్ ప్రెస్ న్యూ స్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్ టిఏ) నిర్వహించిన 'నీట్' పరీక్షలో జరిగిన అవకతవకలపై ప్రతిపక్ష కూటమి అయిన ఇండియా బ్లాక్ లోక్ సభ, రాజ్యసభలోనూ శుక్రవారం వట్టుబట్టాక సభలో గలాభ మొదలయింది. దాంతో రెండు సభలను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. ఆ తర్వాత మళ్లీ సమావేశ మొదలయినప్పటికీ వేడి చల్లారకపోయే సరికి లోక్ సభ ప్రొసీడింగ్స్ ను జులై1 (సోమవారం)కి వాయిదా వేశారు. బిజెపి నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకుర్ లోక్ సభలో నేడు రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ప్రధాని మోడీ జులై 2న సమాధానాలు ఇవ్వనున్నారు. బిజెపి ఎంపీ బన్సురీ స్వరాజ్ రెండో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

## సంస్కరణలతో దేశ ప్రగతిని పరుగులు పెట్టించిన పి.వి.- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జూన్ 28 :సంస్కరణలతో దేశ ఆర్థిక ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావుకు దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహా రావు జయంతిని పురస్కరించుకొని ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో పి.వి. చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రంలో వివిధ శాఖల మంత్రిగా, ప్రధానమంత్రిగా పి.వి. చేసిన సేవలు మరువరానివని పేర్కొన్నారు. ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి రెడ్డి పి.వి. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## కేంద్ర మంత్రి కుమార స్వామితో మంత్రి దుద్దిళ్ల భేటి

### -ఆ భూములు రాష్ట్రానికి ఇవ్వాలని అభ్యర్థన



హైదరాబాద్, జూన్ 28 :కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ (పిఎస్ యూ) లకు రాష్ర ప్రభుత్వం అప్పట్లో కేటాయించిన భూములను వెనక్కు తిరిగి ఇవ్వాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్ డి కుమారస్వామిని కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న శ్రీధర్ బాబు కేంద్ర మంత్రితో నేడు సమావేశమై పలు అంశాలను చర్చించారు. ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రం పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమం కింద విక్రయించాలని నిర్ణయించినందున వాటి మిగులు భూములను తిరిగి అప్పగించాలని కేంద్ర మంత్రిని అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 70 సంవత్సరాల్లో అనేక ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేయగా వాటికి అప్పట్లో వేలాది ఎకరాల భూములను కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు.

ఖాయిలా పడిన ఆదిలాబాద్ సిసిఐ సిమెంటు పరిశ్రమను పునరుద్ధరించి స్థానికంగా ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలని కోరారు. 4 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ఈ సిమెంటు పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం 2100 ఎకరాల సున్నపు రాతి గనులతో పాటు మొత్తం 2290 ఎకరాల భూమిని ఉచితంగా అందజేసిందని గుర్తు చేసారు. దీనిని ప్రయివేటు పరం చేసే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు.

తెలంగాణాలో పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత అనుకూల పరిస్థితులు ఉన్నందున కొత్తగా ఏర్పాటు చేయబోయే ఇండస్ట్రీస్ ను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో రాష్ట్రం ముందంది. ఇక్కడ భూములు, నీరు, విద్యుత్తు అవసరాల మేరకు అందుబాటులో ఉన్నందున పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

రాష్ట్రంలో శిక్షణ పొందిన మానవ వనరులకు కొదవ లేదని, ఐటిఐ, డిప్లొమా, ఇంజనీరింగ్ స్థాయిల్లో స్కిల్డ్ మ్యాన్ పవర్ సమృద్ధిగా ఉందని వెల్లడించారు.

రాష్ట్రాన్ని సందర్శించి ఇక్కడి అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలన్ని శ్రీధర్ బాబు అభ్యర్థనకు కుమారస్వామి సానుకూలంగా స్పందించారు. త్వరలో హైదరాబాద్ కు వచ్చి తన దృష్టికి తెచ్చిన అన్ని విషయాలపై అధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు.

## షాద్‌నగర్ క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలి : సీఎం రేవంత్ ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 28 : షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో శుక్రవారం సాయంత్రం జరిగిన భారీ అగ్నిప్రమాదం లో గాయపడ్డ బాధితులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఘటనలో ఆరుగురు మృత్యువాత పడగా పదుల సంఖ్యలో కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద విషయం తెలియగానే ముఖ్యమంత్రి అధికారులతో మాట్లాడి తగు ఆదేశాలు జారీ చేశారు.

ప్రమాదంలో గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. ప్రమాద స్థలంలో ఉన్న కలెక్టర్, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, కార్మిక, పరిశ్రమలు, వైద్య బృందాలు ఘటనా స్థలంలోనే ఉండి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సౌత్ గ్లాస్ ప్రైవేటు కంపెనీలో ఫర్నస్ పేలడంతో మంటలు చెలరేగినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

అగ్నికీలల ధాటికి ఆరుగురు మృతి చెందగా, దాదాపు 15 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పోలీసులు సమీప ఆస్పత్రులకు తరలించారు. చికిత్స పొందుతున్న వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బాధిత కార్మికులంతా ఉత్తర ప్రదేశ్‌కు చెందిన వారిగా గుర్తించారు.

## కాంగ్రెస్ లోకి మరో బిఆర్ఎస్ ఎమ్మెల్యే -హస్తం గూటిలో కాలె యాదయ్య..

హైదరాబాద్, జూన్ 28 :కాంగ్రెస్ గూటిలోకి మరో బిఆర్ఎస్ ఎమ్మెల్యే చేరిపోయారు..

ఇప్పటికే పోచారం, సంజయ్ కుమార్ లు హస్తం తీర్థం తీసుకోగా తాజాగా చేవెళ్ల బీఆరెస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య కూడా ఆ పార్టీలో చేరారు.. ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జ దీపాదాస్ మున్షి సమక్షంలో నేడు కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యే కాలె యాదయ్యకు సిఎం రేవంత్ రె?డ్డి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ లోకి ఆహ్వానించారు..

## కేంద్ర ఆర్థిక మంత్రిని కలిసిన ఎంపీ ధర్మపురి అరవింద్..



నిజామాబాద్, జూన్ 28 :కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ మర్యాదపూర్వకంగా కలిశారు. రెండవసారి మంత్రిగా బాధ్యతలు చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నిర్మల సీతారామన్ రెండవసారి భారీ మెజారిటీతో ఎంపీగా గెలుపొందిన ధర్మపురి అరవింద్ కు అభినందనలు తెలిపారు.

## బిల్ట్ ఫ్యాక్టరీని మళ్లీ తెరిపిస్తాం - మంత్రి సీతక్క



వరంగల్, జూన్ 28 :ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలో గత పదేండ్ల క్రితం మూతపడిన బిల్ట్ కంపెనీకి త్వరలోనే మంచి రోజులు రానున్నాయని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మూత పడిన బిల్ట్ ఫ్యాక్టరీని మంత్రి సీతక్క ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రా, జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీజ తదితరులతో కలిసి శుక్రవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక పక్షపాతి అని అన్నారు. బిల్ట్ ఫ్యాక్టరీలోని పాత యంత్రాలు, పాత సామాను తొలగింపు, సంబంధిత విషయాలను ఫిన్ క్వెస్ట్ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. పాత మిషనరీ తొలగింపు విషయంలో జాప్యం చేయకుండా చూడాలని ఫిన్ క్వెస్ట్ సంస్థ, రాధా స్టీల్ సంస్థ ప్రతినిధులకు సూచించారు. వీలున్నంత త్వరలో బిల్ట్ ఫ్యాక్టరీని రీ ఓపెనింగ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా, నియోజకవర్గ, బ్లాక్, మండల, గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## కర్నాటక రాష్ట్రం హవేరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### -ఆగి ఉన్న లారీని మినీ బస్సు ఢీకొట్టడంతో 13 మంది మృతి



బెంగళూరు జూన్ 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: కర్నాటక రాష్ట్రం హవేరి జిల్లాలో శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుండెనహళ్లి శివారు లోని పుణె–బెంగళూరు జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని మినీ బస్సు ఢీకొట్టడంతో 13 మంది చనిపో యారు. నలుగురు గాయపడడంతో ఆస్పత్రికి తరలిం చారు. క్షతగాత్రులలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. శివమొగ్గ జిల్లా భద్రావతి తాలూకాలోని ఈమ్మహట్టి గ్రామానికి చెందిన 17 మంది భక్తులు బెళగావి ప్రాంతం శవదత్తిలోని ఎల్లమ్మ ఆలయానికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులలో పరుశురామ్(45), భాగ్య(40), నాగేశ్(50), విశాలక్షి(50), సుభద్రా బాయ్(65), పుణ్య(50), మంజుల బాయ్(57), డ్రైవర్ అదర్ష్(23), మానస(24), రూపా(40), మంజుల(50), ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## కాంగ్రెస్ బీఫామ్ మీద గెలిచిన వారికే మంత్రి పదవి : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 28 : మంత్రివర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్ష ఎంపికపై చర్చలు ప్రారంభమయ్యాయని సీఎం, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. దీనిపై పార్టీ పెద్దలు సమాలోచనలు చేస్తున్నారని తెలిపారు. ఎవర్ని మంత్రివర్గంలోకి తీసుకోవాలి.. ఎవరికి పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలనేది పార్టీ పెద్దలే నిర్ణయిస్తారని పేర్కొన్నారు.

పీసీసీ రేసులో ఎవరైనా ఉండొచ్చని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఎంపికలో సామాజిక న్యాయం తప్పనిసరిగా ఉంటుందని అన్నారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మహిళలు, ఈబీసీల్లో ఎవరినైనా పీసీసీ చీఫ్‌గా ఎంపిక చేయవచ్చని పేర్కొన్నారు. మహిళలకు కూడా పీసీసీ ఇస్తే ఎలా ఉంటుందన్న ప్రశ్నకు రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. ఇస్తే బాగానే ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇక కాంగ్రెస్ బీ ఫారం మీద గెలిచిన వారికే మంత్రి పదవుల్లో స్థానం ఉంటుందన్నారు.పార్టీ ఫిరాయింపులకు తెలంగాణ రాష్ట్రం ఒక్కటే ప్రత్యేకం కాదని ఆయన అన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనూ ఎమ్మెల్యేలు ఫిరాయించారని చెప్పారు. నలుగురు టీడీపీ రాజ్యసభ ఎంపీలతో ఏకంగా పార్టీనే.. బీజేపీ విలీనం చేసుకుందన్నారు. ఉచిత పథకాలను తప్పుపట్టడం సరికాదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.అవసరం ఉన్నవారికే సంక్షేమ పథకాలు అందాలి తప్ప.. సంపన్నులకు కాదని స్పష్టం చేశారు.

## ప్రజాభవన్‌లో ప్రజావాణి...494 దరఖాస్తుల స్వీకరణ



హైదరాబాద్, జూన్ 28:: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలు చిన్నారెడ్డిని, ప్రజాభవన్ అధికారులను కలిసి వినతిపత్రాలు అందచేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 494 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 125, హౌసింగ్ కు సంబంధించి 43 దరఖాస్తులు, పౌరసరఫరాల శాఖ కు సంబందించి 71, హోం శాఖకు సంబందించి 45 దరఖాస్తులు, పంచాయతి రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కు సంబందించి 47, ఇతర శాఖలకు సంబంధించి 48 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య ఇతర అధికారులు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించండం తో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## జగన్నాథ రథయాత్రకు విస్తృత ఏర్పాట్లు

న్యూఢిల్లీ, జూన్ 28 :పూరి జగన్నాథ రథయాత్రకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. కోట్లాది మంది భక్తులు తరలివచ్చే ఈ యాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఏటా ఆషాడ శుద్ధ తదియ రోజున జరిగే ఈ రథయాత్రను వీక్షించేందుకు దేశం నలుమూలల నుంచీ భక్తులు తరలివసంటారు. జులై 7న పూరీ జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవం జరగనుండగా ఈసారి ఒకే రోజున నవయవ్వన వేడుక, నేత్రోత్సవం, ఘోషయాత్ర నేత్రపర్వంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నా యి.చివరి సారిగా 1971లో ఒకే రోజున మూడు వేడుకలు జరగ్గా 53 ఏండ్ల తర్వాత ఇది పునరావృతమైంది. ఇక రథయాత్రకు సంబంధించి ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేపట్టింది. రథయాత్ర ఏర్పాట్లపై ఒడిషా సీఎం మోహన్ చరణ్ మాఝీ, ఇరువురు డిప్యూటీ సీఎంలు కేవీ సింగ్ డియో, ప్రవతి పరిదా రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్‌తో శుక్రవారం ఢిల్లీలో సమావేశమయ్యారు.ఇక రథయాత్రకు గత ఏడాది కంటే అత్యధికంగా ఈసారి 315 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ పేర్కొన్నారు. ఒడిషాలోని అన్ని ప్రాంతాల నుంచి ఈ రైళ్లు నడుస్తాయని చెప్పారు. ప్రత్యేక రైళ్లతో పాటు పూరిలో 15,000 మందికిపైగా వసతి సౌకర్యం కల్పించనున్నట్టు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రవాణా, వసతి సౌకర్యాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

పూరీ ఆలయ ఆధ్వర్యంలో జరిగే ఉత్సవాలన్నింటికల్లా ప్రత్యేకమైనది జగన్నాథ రథయాత్ర. దేశంలో పూరీ జగన్నాథ రథయాత్ర అత్యంత ప్రాముఖ్యత సంతరించుకుంది. ఈ ఉత్సవం ప్రతీ సంవత్సరం జూన్ లేదా జూలై నెలల్లో నిర్వహిస్తారు. ఈ రథయాత్రలో శ్రీకృష్ణుడు, బలరాముడు, సుభద్ర విగ్రహాలను పూరీ నగర వీధుల్లో ఊరేగిస్తారు. ఈ రథం దాదాపు 45 అడుగుల ఎత్తు, 35 చదరపు అడుగుల వైశాల్యం కలిగి ఉంటుంది. దీనికి ఏడు అడుగుల వ్యాసం కలిగిన 16 చక్రాలు ఉంటాయి. దాదాపు నాలుగు వేల మంది భక్తులు కలిసి ఈ రథాన్ని లాగుతారు. నేత్రపర్వంగా సాగే ఈ ఉత్సవాన్ని వీక్షించేందుకు దేశం నలుమూలల నుంచి భక్తులు లక్షలాదిగా తరలి వస్తారు.

## నేటి కందం– నేటికీ అందం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

రీతిని నీతిని దెలుపుచు
ఖ్యాతిని బొందిన ప్రశాంతు నాత్మీయునిగా
జాతి తలపులో నిలుపుచు
జాతీయ గణాంక దినము జరుపగ వలయున్

(జూన్ 29 జాతీయ గణాంక దినం)



-రాధశ్రీ
సెల్:9494481210

# ఫోటో గత ఘన చరిత్రకు సాక్ష్యం !

(29 జూన్ 'ప్రపంచ కెమెరా దినం' సందర్భంగా)

ఫోటోలు తీసే సాధనంగా 'కెమెరా' మనందరికీ అనాదిగా పరిచయమే. తమ తమ డ్రాయింగ్ రూముల్లో గోడలకు వేళాడే ఫోటోలు తమ గత జీవితపు ముఖ్య సన్నివేశాలు, వేడుకలను నిత్యం గుర్తు చేస్తుంటాయి. ఫోటోగ్రఫీ అనగా 'వెలుతురుతో వ్రాయడం' అని, 'కెమెరా అబ్స్కురా' అనగా 'చీకటి గది' అని అర్థం.

2017 వివరాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 1.2 ట్రిలియన్ డిజిటల్ ఫోటోలు అందుబాటులో ఉన్నాయని అంచనా. జీవితంలో ఓ భాగమైన కెమెరా ప్రాధాన్యాన్ని గుర్తించిన అంతర్జాతీయ సమాజం ప్రతి ఏట 29 జూన్ రోజున "ప్రపంచ కెమెరా దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. డిజిటల్ యుగంలో నేడు ప్రతి ఒక్కరి చేతులో స్మార్ట్ ఫోన్ రూపంలో కెమెరా దాగి ఉంది. ప్రతి క్షణాన్ని కెమెరాలో బంధించడం, ప్రాణాలకు సహితం తెగించి అరుదైన ఫోటోలను సెల్ఫీల రూపంలో తీసుకోవడం అత్యంత ప్రాధాన్య అంశం అయ్యింది.

**కెమెరా, ఫోటోగ్రఫీ చరిత్ర:**

కెమెరా, ఫోటోగ్రఫీ చరిత్ర 1825లో హెలియోగ్రాఫ్ రూపంలో 'జోసెఫ్ నైసీ' చొరవతో ప్రారంభమైంది. 1839లో 'లూయిస్ జాఖీస్ దగ్యూరె' కృషితో ప్రథమ వెలసిపోని ఫోటోను తీయడంతో వారిని 'ఫోటోగ్రఫీ పితామహుడు'గా పిలుస్తున్నారు. ఫోటోగ్రఫీ రంగంలో స్థిరమైన ఫోటోఫిలిమ్ రూపకర్తగా 'జార్జ్ ఈస్ట్‌మన్' పరిశోధనలో 1888లో తొలి 'కొడాక్' కెమెరా ఆవిర్భవించింది. 1936లో జపాన్ దేశంలో 'కానన్' కెమెరా తయారుచేయబడి అమ్మకానికి వచ్చింది. 1989లో తొలి 'డిజిటల్ కెమెరా'ను జపాన్‌లోని 'ఫ్యూజీ' కంపెనీ వాణిజ్యపరంగా విడుదల చేసింది. 2010 వరకు మార్కెట్‌లో 'డిజిటల్ వీడియో కెమెరా' అందుబాటులోకి వచ్చింది. ప్రతి ఒక్కరి జీవితంలో ఫోటోల ప్రాధాన్యతను గుర్తించిన అంతర్జాతీయ సమాజం ప్రతి ఏట 29 జూన్ రోజున 'ప్రపంచ కెమెరా దినం' జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. అత్యంత మేలైన డిజిటల్ కెమెరాలను నిర్మించిన కంపెనీగా 'కొడాక్'కు గుర్తింపు ఉన్నది. ప్రపంచ కెమెరా దినం-2024 థీమ్‌గా "దినమంతా కెమెరా (ఆన్ ఎంటైర్ డే)" అనబడే అంశాని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు.

**జీవితంలో భాగమైన స్మార్ట్‌ఫోన్ కెమెరా:**

వేడుకల్లోని సంతోష క్షణాలను బంధించడం, ప్రకృతి అందాలను బంధించడం, నేర ఘటనలకు సాక్ష్యంగా నిలవడం, ముఖ్య సన్నివేశాలను భావితరాలకు అందించడం, సమాజహిత కార్యాలు, చారిత్రాత్మక ఘటనలు, సమాజంలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులు లాంటి పలు సందర్భాలలో కెమెరాలు తీసే ఫోటోలు మనందరికీ తెలుసు. 2000 నాటికి స్మార్ట్ ఫోన్‌లో కెమెరా ఇమిడి ఉండడంతో సాంప్రదాయ కెమెరాలకు ప్రాధాన్యత తగ్గిందనే చెప్పాలి. కెమెరా లేకుండా నిన్నటి గుర్తులు సజీవంగా కనిపించవు. 'ఒక ఛాయాచిత్రం వేల మాటలకు సమాన అర్థాన్ని ఇస్తుంది' అనేది అతిశయోక్తి కాదు. గత స్మృతులకు నిలువెత్తు సాక్ష్యాలు ఛాయాచిత్రాలు. నేడు మన చేతిలో ఇమిడి ఉన్న స్మార్ట్ ఫోన్ల మాధ్యమంగా 'సెల్ఫీ ఫోటోలు' తీసుకునే ఆధునిక సాంకేతిక ఉపకరనాలు మనకు చేరువైనాయి. కెమెరాతో ఫోటోలు తీయగలగడం అనేది ఓ అద్భుత కళ. ఒక చక్కటి ఛాయాచిత్రం ఓ అద్భుత మనోఉల్లాసానికి కారణం అవుతుంది. ఓ ఫోటో వేల ఏండ్లు చరిత్రకు సాక్షిగా నిలుస్తుంది. నేటి స్మార్ట్ ఫోన్‌లో ఇమిడి ఉన్న అత్యాధునిక కెమెరాను ఉపయోగించి నిత్యం ఎన్నో అద్భుత సన్నివేశాలను బంధిస్తున్నాం. నేటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన కెమెరాతో క్షణాల్లో ఫోటో తీయడం, వేల ఫోటోలను సేవ్ చేసుకోగలగడం, ఫోటోలను తిరిగి మెరుగుపరుచుకోగలగడం లాంటి వసతులు అందుబాటులోకి వచ్చాయి.

ప్రపంచ కెమెరా దినం సందర్భంగా మన స్మార్ట్ ఫోన్‌ను ఉపయోగించి పలు సన్నివేశాలను బంధించడం, మన ఫోటోలను సామాజిక మాధ్యమాల ద్వారా బంధుమిత్రులకు పంపించడం, కెమెరా మెలుకువలు తెలుసుకోవడం, ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహించడం, కెమెరా/ఫోటోగ్రఫీ కళ/నైపుణ్యం/సైన్స్/చరిత్రను తెలుసు కోవడం లాంటి కార్యక్రమాలు నిర్వహించవచ్చు. కెమెరా ప్రాధాన్యతను గుర్తించి అవసర సందర్భాలలో పలు వేడుకలు/సమావేశాలు/సభలు/సంఘటనలు/ ప్రకృతి రమణీయతలు/పండుగలు/సంస్కృతులు మొదలైన చిరస్మరణీయ సన్నివేశాలను బంధించే సదవకాశాలను అందిపుచ్చుకోవడానికి మనందరం ప్రయత్నిద్దాం.

– డా|| బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# అత్యవసర పరిస్థితిని విధించడం ప్రపంచంలో కెల్లా అతిపెద్ద ప్రజాస్వామ్యాన్ని చీకటిలోకి నెట్టివేసిందన్న ఉప రాష్ట్రపతి

న్యూఢిల్లీ, జూన్ 28 :అత్యవసర పరిస్థితి ని 1975 వ సంవత్సరం లో విధించిన కారణం గా ప్రపంచం లో అతి పెద్ద ప్రజాస్వామ్యం అంధకారం లో మునిగిపోయింది అని ఉప రాష్ట్రపతి శ్రీ జగ్ దీప్ ధన్ ఖడ్ ఈ రోజు న అన్నారు. అత్యవసర పరిస్థితి తాలూకు చీకటి రోజుల ను శ్రీ జగ్ దీప్ ధన్ ఖడ్ గుర్తు కు తీసుకు వస్తూ ఆ రోజులు మరెన్నటికీ పునరావృత్తం కావు, దీనికి కారణం భారతదేశం లో రాజ్యాంగయుక్త ప్రజాస్వామ్యం చాలా బలం గా ఉండడమే; మరి ఇప్పుడు గ్రామ స్థాయి లో, రాష్ట్ర స్థాయి లో మరియు కేంద్రం స్థాయి లో రాజ్యాంగం పరంగా ప్రజాస్వామ్యం సుదృఢం గా ఉన్నది అని వివరించారు.

సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (సిఇఎల్) స్వర్ణోత్సవ వేడుకల లో శ్రీ జగ్ దీప్ ధన్ ఖడ్ పాలుపంచుకొని సభ ను ఉద్దేశించి ప్రసంగిస్తూ, దేశం లో శాస్త్రవేత్తలు మరియు సాంకేతిక విజ్ఞానవేత్తలు పోషిస్తున్నటువంటి పాత్ర ను ప్రస్తావించారు. వారు 'న్యూ ఇండియా' యొక్క నిర్మాతలు అని ఆయన అభివర్ణించారు. సిఇఎల్ మునుపు నష్టాల బారిన పడ్డ ప్రభుత్వ రంగ సంస్థ (పిఎస్‌యు); పెట్టుబడుల ఉపసంహరణ కొస వరకూ వెళ్ళిపోయింది కాస్తా తాజా గా మిని రత్న స్థాయి ని అందుకొంది. ఈ మేలు మలుపు హర్షణీయం అని ఉప రాష్ట్రపతి అన్నారు. సిఇఎల్ ఇతర సంస్థల కు శక్తి ని పుంజుకోవడానికి , స్వయ ప్రేరణ ను పొంది ఆయా సంస్థ లు కూడా ఇదే కోవ లో వృద్ధి చెందేందుకు ఆదర్శప్రాయం అయినటువంటి నమూనా గా ఉంది అని ఉప రాష్ట్రపతి చెప్పారు.

"ఈ కథ ఒక్క సాంకేతిక పరమైన ముందంజ మాత్రమే కాదు, ఇది జీవనం లో పరివర్తన ను తీసుకు రావడం, సముదాయాల సశక్తీకరణ, ఇంకా వినూత్న ఆవిష్కరణలు, ఆటుపోటుల కు తట్టుకొని నిలబడగలగడం మరియు ఉత్కృష్ట సాధన ల మార్గం లో సాగిపోతూ మన దేశం యొక్క వ్యూహాత్మక హితాల ను పరిరక్షిస్తూ ఉండడానికి సంబంధించింది కూడాను" అని ఆయన అన్నారు.

సౌర శక్తి రంగం లో సిఇఎల్ సాధించినటువంటి అసాధారణమైన పురోగతి ని గురించి శ్రీ జగ్ దీప్ ధన్ ఖడ్ చెప్తూ, నవీకరణ యోగ్య శక్తి కేవలం ఒక ప్రత్యామ్నాయం కాదు, అది భవిష్యత్తు వైపునకు నడిపించేది అన్నారు. "సుస్థిర శక్తి సంబంధి పరిష్కార మార్గాల పైన సిఇఎల్ తన దృష్టి ని కేంద్రీకరిస్తూ హరిత ప్రధానమైనటువంటి మరియు స్వచ్ఛమైనటువంటి భారతదేశం ఆవిష్కారాని కి తన తోడ్పాటు ను అందిస్తున్నది. సిఇఎల్ యొక్క నూతన ఆవిష్కరణలు చిరకాలం మన్నిక తో ఉండేటటువంటి శక్తి సంబంధి సమాధానాల ను సామాన్య మానవుని కి చేరువ గా తీసుకు వచ్చాయి" అని ఆయన అన్నారు. బ్యాటరీ సంబంధి సాంకేతికతల ను అభివృద్ధి పరచడం కోసం, మరి అలాగే దేశం లో హరిత ప్రధానమైన గతిశీలత ను ప్రోత్సహించడం కోసం చార్జింగ్ సంబంధి మౌలిక సదుపాయాల కల్పన దిశ లో పరిశోధన లను ప్రోత్సహించాలి అని కూడా ఆయన పిలుపునిచ్చారు.

ఎలక్ట్రానిక్ యుద్ధతంత్ర మెలకువలు, కృత్రిమ మేధ (ఎఐ), సైనిక దృష్టి లో భూపరిశీలన, మరియు నిశిత పర్యవేక్షణ ల అండదండల తో భద్రత సంబంధి ముఖచిత్రం పలుమార్పుల కు లోనవుతున్న సంగతి ని శ్రీ జగ్ దీప్ ధన్ ఖడ్ నొక్కిపలుకుతూ, జాతీయ హితాల సురక్ష లో సిఇఎల్ కు ఉన్న వ్యూహాత్మక ప్రాముఖ్యాన్ని గురించి ప్రముఖం గా ప్రకటించారు. "ఇంతవరకు ఉన్న వ్యవస్థ లో పెను మార్పుల ను ప్రవేశపెట్టిన ఈ కోవ కు చెందిన సాంకేతికత లు అన్నిటికీ ఎలక్ట్రానిక్స్ యే గుండెకాయ లా ఉంది. ఎలక్ట్రానిక్స్ యే ఏ భావి కాలపు సాంకేతికత పరమైన అభివృద్ధి కి మరియు విస్తరణ కు మూలం, ఆధారం అవుతుంది" అని ఆయన అన్నారు.

ఎలక్ట్రానిక్స్ మేన్యుఫేక్చరింగ్ ఇకోసిస్టమ్ కు అండదండలను అందించేందుకు దేశం లో ఇటీవల తీసుకొన్న నిర్ణయాల ను శ్రీ జగ్ దీప్ ధన్ ఖడ్ ప్రశంసిస్తూ, ఆత్మనిర్భరత ను సాధించడానికి ఎలక్ట్రానిక్స్ డిజైన్ లోను, ఎలక్ట్రానిక్స్ తయారీ లోను స్వదేశీ సామర్థ్యాల ను పెంపొందింపచేసుకోవడానికి ఎనలేని ప్రాముఖ్యం ఉందన్నారు.

అంతక్రితం సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (సిఇఎల్) యొక్క స్వర్ణోత్సవ అధికార చిహ్నాన్ని ఉప రాష్ట్రపతి శ్రీ జగ్ దీప్ ధన్ ఖడ్ ఆవిష్కరించడం తో పాటుగా బహుళోపయోగ సభా మందిరం అయినటువంటి 'స్వర్ణ మండపమ్' ను కూడాను ప్రారంభించారు.

ఈ కార్యక్రమం లో సైన్స్ ఎండ్ టెక్నాలజీ శాఖ మాన్య మంత్రి డాక్టర్ శ్రీ జితేంద్ర సింహ్, డిఎస్ఐఆర్ యొక్క సెక్రట్రి మరియు సిఎస్ ఐఆర్ యొక్క డైరెక్టర్ జనరల్ డాక్టర్ శ్రీ ఎన్. కళైసెల్వి, సిఇఎల్ యొక్క సిఎమ్‌డి శ్రీ చేతన్ ప్రకాశ్ జైన్, సిఇఎల్ పరివారం లోని సభ్యులు, ఇంకా ఇతర ఉన్నతాధికారులు కూడా పాలుపంచుకొన్నారు.

# 2024-25లో సుమారు 4.29 కోట్ల మొక్కలు నాటాలన్న సంచిత లక్ష్యం

న్యూఢిల్లీ, జూన్ 28 :ఎన్‌సిఆర్‌లోని బహిరంగ ప్రదేశాలలో విస్తృతమైన పచ్చదనం, తోటల పెంపకానికి, ముఖ్యంగా రోడ్లు, రోడ్ల ఇరువైపుల / మార్గాలు మొదలైన వాటి మధ్య అంచుల వెంబడి, అధిక స్థాయి ధూళిని తగ్గించడానికి సమర్థవంతమైన మార్గంగా కమిషన్ గుర్తించింది. పేలవమైన గాలి నాణ్యత, ముఖ్యంగా మొత్తం ఎన్‌సిఆర్ లో పొడి వేసవి సీజన్లలో ఇది ప్రధాన ఆందోళనలలో ఒకటి. వాయు కాలుష్యాన్ని తగ్గించే దిశగా నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సిఆర్) గ్రీన్ కవర్‌ను మెరుగుపరచడానికి ఎటువంటి అవకాశాన్ని వదలకుండా, ఎన్‌సిఆర్, పరిసర ప్రాంతాలలో వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సిఏక్యూఎం) క్రియాశీల భాగస్వామ్యం, సహకారంతో ఈ ప్రయత్నంలో ముఖ్యమైన మైలురాళ్లను దాటింది. అన్ని ఎన్‌సిఆర్ రాష్ట్ర ప్రభుత్వాలు, ఢిల్లీలోని ఎన్సిటి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంలోని వివిధ ఏజెన్సీలు, ఎన్‌సిఆర్ లో ఉన్న విద్యా మరియు శాస్త్రీయ పరిశోధన-ఆధారిత సంస్థలతో సహా అన్ని దీనిలో భాగస్వామ్యం అవుతున్నాయి.

2021-22లో కేవలం 28,81,145 కొత్త తోటల పెంపకంతో ఈ దిశలో నిరాడంబరమైన ప్రారంభం జరగగా, 2022-23లో ఎన్‌సిఆర్‌లో 3,11,97,899 కొత్త ప్లాంటేషన్‌లు జరిగాయి. 2023-24కి మొత్తం ఎన్‌సిఆర్ పరిధిలో ఎన్‌సిఆర్ రాష్ట్ర ప్రభుత్వాలు/జీఎన్‌సిటిడి కోసం 3.85 కోట్ల కొత్త ప్లాంటేషన్ల మరింత ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని ఏర్పాటు చేయడం, సంవత్సరంలో దాదాపు 3.6 కోట్ల ప్లాంటేషన్లు విజయవంతంగా నిర్వహించడం జరిగింది. తద్వారా మొత్తం 93.5 శాతం లక్ష్యాలను సాధించడం జరిగింది. ఎన్‌సిఆర్ ప్రాంతాల్లో 2023-24 వ్యక్తిగత లక్ష్యాలకు సంబంధించి రాష్ట్రాల వారీగా పాటించడం ఢిల్లీకి 84.6 శాతం; హర్యానాకు 87.4 శాతం; రాజస్థాన్‌కు 86.2 శాతం; మరియు యుపికి 103.4 శాతం లక్ష్యంగా నిర్ధారించారు.

2023-24లో ప్లాంటేషన్‌లతో పోల్చితే గ్రీనింగ్/ప్లాంటేషన్ యాక్షన్ ప్లాన్ 2023-24 కింద వివిధ వాటాదారుల ప్లాంటేషన్ లక్ష్యాన్ని సూచించే తులనాత్మక పట్టిక, 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యం పట్టిక:

విద్యాసంస్థలు, పరిశోధన ఆధారిత సంస్థలు, ఇతర వాణిజ్య/పారిశ్రామిక విభాగాలకు సరిహద్దుల వెంబడి పెద్ద ఎత్తున పచ్చదనం, బయో-బారికేడింగ్‌పై కమిషన్ తగిన ప్రాధాన్యతనిస్తుంది. దట్టమైన పట్టణ సముదాయాలలో బహిరంగ భూభాగాల కొరత నేపథ్యంలో, కమిషన్ ప్రభావవంతమైన పట్టణ అటవీ కార్యక్రమాల ద్వారా పచ్చదనం, మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది, ముఖ్యంగా మియావాకీ సాంకేతికతపై దృష్టి సారించింది. ఇంకా, ప్రధాన ట్రంక్ రోడ్ల సెంట్రల్ అంచులు/మీడియన్‌లను వీలైనంత వరకు, రహదారి పక్కన, బహిరంగ మార్గాల్లో కుడివైపున ఉన్న ప్రదేశాలలో పూర్తి పచ్చదనాన్ని లక్ష్యంగా చేసుకోవాలని ఎన్‌సిఆర్‌లోని అన్ని రహదారి యాజమాన్య ఏజెన్సీలకు కమిషన్ సూచించింది.

ఎన్‌సిఆర్ రాష్ట్ర ప్రభుత్వాలు/జీఎన్‌సిటిడి, సెంట్రల్ ఏజెన్సీలు, ప్రధాన విద్యాసంస్థలు, ఎన్‌సిఆర్ ఉన్నత విద్య/పరిశోధన సంస్థల ప్రతినిధులతో సమావేశాల సందర్భంగా, సిఏక్యూఎం ద్వారా ఈ క్రింది కీలక అంశాలపై దృష్టి పెట్టారు:

తోటల పెంపకం కార్యకలాపాలను నిర్వహిస్తున్నప్పుడు, స్థానిక మొక్కల జాతులు ఉపయోగాన్ని దృష్టిలో పెట్టుకోవాలి .

ప్లాంటేషన్ కార్యక్రమంలో పర్యవేక్షణ, మొక్కల సంరక్షణ, మనుగడ రేటు, తోటల పెంపకం కీలక అంశాలు

కమిషన్ 6-7 అడుగుల మంచి ఎత్తు ఉన్న పొదలను సిఫార్సు చేసింది, తద్వారా పర్యావరణం నుండి దుమ్మును బంధించడానికి తగు అవకాశం ఉంటుంది.

పారిశ్రామిక ప్రాంతాలు, పాఠశాలలు, కళాశాలలు మొదలైన వాటితో పాటు దట్టమైన చెట్లు/పొదలతో బారికేడింగ్ వేయడం కూడా దుమ్ము/కాలుష్యాన్ని నిరోధించడంలో సహాయపడుతుంది.

తోటల పెంపకం కార్యకలాపాలకు భూమి లభ్యత పట్టణ ప్రాంతాలలో తక్కువగా ఉంది. సాంప్రదాయ ప్లాంటేషన్ చేయబడిన ప్రదేశాలలో మొక్కలతో ఖాళీలను పూరించడం, దట్టమైన తోటలను సాధించడానికి చేపట్టవచ్చు.

ఆర్థిక సంవత్సరంలో ప్లాంటేషన్ లక్ష్యం గత సంవత్సరం కంటే కనీసం 20 శాతం ఎక్కువగా ఉండాలని సూచించారు.

రాష్ట్రాల వారీగా ప్లాంటేషన్ లక్ష్యాలతో సహా ఎన్‌సిఆర్ కోసం సమగ్ర హరితహారం కార్యాచరణ ప్రణాళిక అమలు పురోగతిని కమిషన్ నిశితంగా పర్యవేక్షిస్తుంది. సంబంధిత ఏజెన్సీలు ప్రత్యేకంగా స్థానిక జాతుల తోటలను ఆశ్రయించాలని, సరైన పోస్ట్-ప్లాంటేషన్ సంరక్షణ, పెంపకం ద్వారా అధిక మనుగడ రేటును సాధించాలని సూచించారు.

# బైజూస్‌కు సంబంధించి ఈ మధ్యన వెలువడిన వార్తలను ఖండించిన ఎంసీఏ

న్యూఢిల్లీ, జూన్ 28 :ఆర్థిక నేరాల ఆరోపణల నేపథ్యంలో బైజూస్ సంస్థపై జరుగుతున్న విచారణనుంచి ఆ సంస్థను తప్పించినట్టు వస్తున్న వార్తలను కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ (ఎంసీఏ) ఖండించింది.

అలాంటి వార్తలను నమ్మవద్దని అవి అవాస్తవాలని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా వున్నాయని ఎంసీఏ నిర్ద్వందంగా స్పష్టం చేసింది. కంపెనీల చట్టం 2013 ప్రకారం ఎంసీఏ మొదలుపెట్టిన విచారణ కొనసాగుతోందని ఇప్పటివరకూ ఆ ఆరోపణలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఎంసీఏ పేర్కొంది.

# రామోజీరావుది భయమెరుగని జీవితం.. పోరాటం ఆయనలో ఓ భాగం : సీఎం చంద్రబాబు



అమరావతి, జూన్ 28 :ఆంధ్రప్రదేశ్‌లోని కానూరులో ప్రభుత్వం నిర్వహించిన రామోజీరావు సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ.. ఒకే ఒక ఎన్టీఆర్.. ఒకే ఒక రామోజీరావు ఇద్దరూ ఇద్దరే అని. ఒకే ఒక ఎన్టీఆర్ ఒకే ఒక రామోజీరావు వీరిని అధిగమించటం ఎవ్వరికీ సాధ్యం కాదు అని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్‌తో పాటు రామోజీరావుకు కూడా భారతరత్న ఇవ్వాలన్నదే అందరి కోరిక అని అన్నారు.

భయమనేది రామోజీరావు జీవితంలో లేదు.. పోరాటం ఆయనలో ఓ భాగం.. రామోజీరావు అక్షర శిఖరం.. సాధారణ కుటుంబంలో పుట్టి అచంచలమైన విశ్వాసంతో ఎదిగారు.. రామోజీరావు వ్యక్తి కాదు వ్యవస్థ.. చేపట్టిన ఏ రంగమైనా ఉన్నత స్థానంలో నిలిపేందుకు కృషి చేశారు అంటూ ఆ అక్షర యోధుడిని స్మరించుకున్నారు.

మార్గదర్శిలో ప్రతి పెట్టుదారుడు రామోజీరావు వెంటే నిలిచారంటే అదీ ఆయన విశ్వసనీయత అన్నారు చంద్రబాబు.. 40 ఏళ్లుగా నెంబర్1 లో ఈనాడు ఉందంటే ఎంతటి కార్యదీక్ష ఉందో అందరూ అర్థం చేసుకోవాలన్న ఆయన.. రాజధానికి రామోజీరావు సూచించిన పేరు ప్రపంచ మంతా మార్మోగింది.. తెలుగు భాష అంటే రామోజీరావుకు ఎనలేని అభిమానం, తెలుగు జాతి అంటే ఎనలేని ఆప్యాయత.. రామోజీరావు స్థాపించిన వ్యవస్థ ఆయన కుటుంబ సభ్యులదే కాదు, 10 కోట్ల మంది ప్రజలది అని అన్నారు.

అమరావతి, ఢిల్లీలో రామోజీ సైన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తాం? అమరావతిలో రోడ్డుకు రామోజీ మార్గ్‌గా పేరు పెడతాం? విశాఖలో రామోజీరావు చిత్రపురి నిర్మిస్తాం అని పేర్కొన్నారు. ఇక, విశాఖలో రామోజీరావు మొదటి అడిషన్ పెట్టారు? ఈనాడు ప్రజాగళంగా ప్రజా చైతన్యం కోసం పనిచేస్తున్నది.. పత్రికా రంగంలో ఉండి రామోజీరావు ప్రజా సమస్యల కోసం పని చేసారు.

సినిమా రంగంలో, జర్నలిజంలో ఎందరినో తయారు చేసారు.. ఒక మెగా స్కేలులో ఆలోచించి జయప్రదం చేసే వ్యక్తి రామోజీరావు.. ఇతర రాష్ట్రాలలో తుఫానులు వచ్చినా ముందుండి సేవలు అందించారు.. ఏ పని చేసినా ప్రజాహితం కోసం పని చేసారు రామోజీరావు.. వివిధ రంగాల్లో సేవలందించిన వ్యక్తిగా ప్రజలు గుర్తు పెట్టుకుంటారు అని కొనియాడారు..

ఎన్ని కష్టాలు వచ్చినా భయపడకుండా.. ధైర్యంగా ఎదుర్కొన్నారు అని గుర్తుచేశారు చంద్రబాబు. ఏ ఐఏఎస్ ను బదిలీ చేయమని, ఏ పనీ తనకు చేసి పెట్టమని ఏరోజు అడగని వ్యక్తి రామోజీరావు. పదవులు కోసం కాదు ప్రజా చైతన్యం కోసం పని చేసిన వ్యక్తి రామోజీరావు.. అప్పట్లో 9 నెలల్లో రామారావు అధికారంలోకి రావడం లో రామోజీరావు పాత్ర ఉంది.. రాజీ పడకుండా పోరాడి, సుప్రీంకోర్టు వరకూ వెళ్ళి తన వనులు నిజం అని నిరూపించుకున్న వ్యక్తి రామోజీరావు.. నలభై ఏళ్ళు నమ్మిన సిద్ధాంతం కోసం పని చేసిన వ్యక్తి రామోజీరావు అని గుర్తుచేసుకున్నారు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు.

# టాప్స్ పథకం సహకారంతో పారిస్ ఒలింపిక్స్‌లో చోటు సాధించిన జుడోకా తులిక మాన్

న్యూఢిల్లీ, జూన్ 28 :జూడోకా తులికా మాన్, భారత జూడోలో వర్ధమాన క్రీడా దిగ్గజం, రాబోయే ప్యారిస్ ఒలింపిక్ క్రీడలలో మహిళల 78 కిలోల పై తరగతిలో స్థానం సంపాదించింది. తులిక భారతదేశం నుండి ఒలింపిక్ క్రీడలలో పాల్గొనే తొమ్మిదవ మహిళా జూడోకా. ప్రభుత్వ టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్) నుండి తనకు గణనీయమైన సహాయం అందిందని తులికా ఆనందం వ్యక్తం చేసింది. టాప్స్ కింద చాలా మంది అథ్లెట్లు ఏడాది పొడవునా ఈవెంట్‌లలో పాల్గొనడానికి మద్దతు పొందుతున్నారని, ఇది వారి ర్యాంకింగ్‌లను కొనసాగించడంలో సహాయపడుతుందని ఆమె పేర్కొన్నారు.

"ఖర్చుల భారం మా మీద లేకపోతేల, మేము ఒత్తిడి లేకుండా పోటీలో పాల్గొనగలం, ఉత్తమమైన ప్రతిభను ప్రదర్శించగలం " ఆమె ఆమె అన్నారు.

2022లో బర్మింగ్‌హామ్‌లో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో రజత పతకాన్ని గెలుచుకున్న తర్వాత తులికా వెలుగులోకి వచ్చారు.

గత నెలలో అబుదాబిలో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో 32వ రౌండ్‌లో కెనడాకు చెందిన పోర్చుండో ఇసాసిపై ఆమె సాధించిన విజయం ఒలింపిక్ ర్యాంకింగ్స్‌లో ఆమె స్థానాన్ని గణనీయంగా పెంచింది. ఈ విజయం ఆమె పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో కీలకమైంది.

గత ఏడాది హాంగ్‌జౌలో జరిగిన ఆసియా క్రీడలు, ఈ ఏడాది ఏప్రిల్‌లో హాంకాంగ్‌లో జరిగిన ఆసియా ఛాంపియన్‌షిప్‌లలో ఆమె ఐదో స్థానం సాధించడం, అవసరమైన పాయింట్లను కూడగట్టడంలో కీలకం. "నేను ఆసియా క్రీడలు, ఆసియా ఛాంపియన్‌షిప్‌లో ఒక్కొక్కటి మూడు బౌట్‌లు గెలిచాను. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో విజయం నాకు సహాయపడింది," ఆమె వెల్లడించారు.

టాప్స్ అనేది భారతదేశపు అగ్రశ్రేణి క్రీడాకారులకు సహాయం అందించడానికి ఉద్దేశించిన యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యక్రమం. నెలవారీ స్టైఫండ్‌తో పాటు విదేశీ శిక్షణ, అంతర్జాతీయ పోటీలు, పరికరాలు, కోచింగ్ క్యాంపుల ద్వారా ఒలింపిక్, పారాలింపిక్ క్రీడలకు సంభావ్య క్రీడాకారులకు ఈ పథకం మద్దతు ఇస్తుంది.






# భూ కుంభకోణం కేసులో హేమంత్ సోరేన్ కు జార్ఖండ్ హైకోర్టు బెయిలు

రాంచీ జూన్ 28 (ఎక్స్ ప్రెస్ న్యూ న్);: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ కు జార్ఖండ్ హైకోర్టు భూ కుంభకోణం కేసులో బెయిలు మంజూరు చేసింది. ఇదిలావుండగా ఆయన తరఫు లాయర్ అరుణభ్ చౌదరి కోర్టు ఆయన ఎలాంటి అపరాధం చేయలేదని భావించిందన్నారు. సోరేన్ పెట్టుకున్న బెయిల్ పై హైకోర్టు జూన్ 13 నిర్ణయాన్ని నిలిపి ఉంచింది.ప్రస్తుతం హేమంత్ సోరేన్ రాంచీలోని బిర్సాముండా జైలులో ఉన్నారు. ఆయన జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) కార్యనిర్వాహక అధ్యక్షుడు. సోరేన్ ను ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్(ఈడి) జనవరి 31న అరెస్టు చేసింది. ఇదిలావుండగా ఈడి తరఫు న్యాయవాది ఎస్. వి. రాజు మాత్రం హేమంత్ సోరేన్ భూ అక్రమాలకు పాల్ప డ్డారని సాక్షులు ధ్రువీకరించారని అన్నారు.

# ద్రావిడ విశ్వవిద్యాలయం ఉప కులపతి మధుజ్యోతి రాజీనామా

అమరావతి, జూన్ 28 :చిత్తూరు జిల్లా కుప్పం ద్రావిడ వర్సిటీ వీసీ ఆచార్య కొలకలూరి మధుజ్యోతి శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు లేఖను ఉన్నతాధికారులకు పంపారు.. అనంతరం వర్సిటీ బోధన, భోధనేతర సిబ్బందితో ఆడిటోరియంలో సమావేశం నిర్వహించి తన పదవీ కాలంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రం టీడీపీ అధికారంలో వచ్చాక అన్ని వర్సిటీల వీసీలు, రిజిస్ట్రార్లు రాజీనామాలు చేస్తున్న క్రమంలో . ఇప్పటికే రిజిస్టర్ వేణుగోపాల్ రెడ్డి తన పదవి కి రాజీనామా చేయగా తాజాగా విసి కూడా పదవీ నుంచి తప్పుకున్నారు..



# టిడిపి అధ్యక్షుడిగా పల్లా బాధ్యతలు స్వీకరణ



అమరావతి, జూన్ 28 :గాజువాక అసెంబ్లీ స్థానం నుంచి రికార్డు మెజారిటీతో ఎన్నికైన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు టీడీపీ ఏపీ అధ్యక్షుడిగా నేడు బాధ్యతలు చేపట్టారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ రాష్ట్ర నాయకత్వ బాధ్యతలను తనకు అప్పగించిన చంద్రబాబు, నారా లోకేశ్ లకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని వెల్లడించారు.

తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించి ప్రభుత్వంలో భాగం చేయడమే ప్రధాన కర్తవ్యంగా పనిచేస్తానన్నారు. పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తానని తెలిపారు. ఐదేళ్ల తర్వాత వచ్చే ఎన్నికల్లోనూ ఇంతే మెజార్టీతో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేలా కృషి చేస్తానని చెప్పారు. రాజకీయ ప్రేరేపిత కేసుల్ని కొట్టివేయిస్తామన్నారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

కాగా, ఏపి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పల్లాకు ఆ పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ అభినందనలు తెలిపారు.

# డెంగ్యూతో జర జాగ్రత్త-డాక్టర్ లిల్లీ మేరి

సిద్దిపేట జూన్ 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : ఒక దోమ మనిషిని అనారోగ్యానికి గురి చేసి ఏమీ కాని వాడిని చేస్తుంది. శక్తిమంతుడైన వ్యక్తిని కూడా శక్తిహీనుడుగా మార్చగల గుతుంది. దోమని నిర్మూలించేందుకు జరుగుతున్న మానవ ప్రయత్నంలో తాత్కాలిక విజయమే దక్కుతుంది, తప్ప పూర్తిగా నిర్మూలించేందుకు సాధ్యం కాకపోవడంతో చివరకు దోమదే పై చేయి అవుతుంది. అందుకు ప్రజలు పరిసరాల పరిశుభ్రత, స్వీయ జాగ్రత్తలు పాటిస్తే దోమలు తమదరిచేరవని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లిల్లీ మేరి తెలిపారు. దోమలు విజృంభిస్తున్నాయంటే అందుకు పరిసరాలు అపరిశుభ్రతనే ప్రధాన కారణం. దీంతో దోమలు ఎక్కువై మనిషిని కుట్టడంతో శారీరకంగా బలహీనుడుగా మారి డెంగ్యూ, మలేరియా, మెదడు వాపు, చికెన్ గున్యా, బోధకాలు వంటి ప్రాణాంతకమైన వ్యాధులు వస్తాయి. మునిసిపల్, గ్రామపంచాయతీ పరిధిలో దోమల ను నిర్మూలించేందుకు సంబంధిత వైద్యాధికారులు సంస్థపరంగా ఎన్ని రకాల చర్యలు తీసుకుంటున్నా, ప్రజల సహకారము లేకుండా ఈ సమస్యను పరిష్కరించలేని పరిస్థితి నెలకొంది. దోమల వ్యాప్తికి వారం రోజుల నిల్వ నీరు ప్రధాన కారణమని తెలిసినా నీరు నిలవకుండా చేయడంలో తీసుకోవల సిన జాగ్రత్తలు పాటించడంలో ప్రజలు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో దోమల సంఖ్య పెరిగి ప్రజలు ప్రాణాంతకమైన రోగాలకు గురవుతున్నారు అని డాక్టర్ లిల్లీ మేరి తెలిపారు

### డెంగ్యూ లక్షణాలు:

జ్వరం, తలనొప్పి , కీళ్ల నొప్పులు, శరీరం పై ఎర్రని మచ్చలు, చిగుళ్ల నుంచి రక్తం కారడం, రక్తంలోని ప్లేట్లెట్స్ తగ్గిపోవడం వంటివి వీటి లక్షణాలు.

### చికిత్స ఇలా...

డెంగ్యూకి నిర్దిష్టమైన మందులు లేవు. కాకపోతే రోగి తాలూకు లక్షణాలను బట్టి చికిత్స ఉంటుంది. వ్యాధి వచ్చిన వ్యక్తికి బీపీ పడిపోకుండా ముందు నుంచి ఓఆ ర్ఎస్ ఇవ్వవచ్చు. షాక్ లోనికి వెళ్తున్నటువంటి వ్యక్తికి ఐవి ఫ్లూయిడ్స్ ఎక్కించాల్సిన అవసరం ఉంటుంది. రక్తస్రావం జరుగుతు న్నటువంటి వ్యక్తికి తాజా రక్తము, ప్లేట్లెట్స్, ప్లాస్మా ఎఫ్ఎఫ్ పి లు అవసరాన్ని బట్టి ఇవ్వవలసి ఉంటుంది. చిన్నా పెద్ద తేడా లేకుండా డెంగ్యూ ఎవరికైనా శోక వచ్చు. ముఖ్యముగా గర్భిణీలు చాలా జాగ్రత్త వహించాలి. జ్వరము ఇతరత్రా నొప్పులు వస్తే వెంటనే డాక్టర్ వద్దకు వెళ్లాలి. అదేవిధంగా ఇంట్లో ఎవరైనా విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతున్న, నలుపు రంగులో మల విసర్జనమ వుతున్న, ముక్కులో నుంచి గాని, చిగుళ్ళ నుంచి గాని రక్త స్రావమవు తున్న, దాహంతో గొంతు ఎండిపోతు న్న, చెమటలు పట్టి శరీరము చల్లబడి పోయిన వెంటనే ఆలస్యం చేయకుండా డాక్టర్ను సంప్రదించాలని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లిల్లీ మేరి అన్నారు.

### నివారణతో ఎంతో మేలు...

ఏ వ్యాధి కైనా చికిత్స కంటే నివారణే మేలు. అందుకు ప్రజలు సీజనల్ వ్యాధులు, ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడకుండా వైద్యుల సూచనలు, సలహాలు విధిగా పాటించాలి. డెంగ్యూ వచ్చేందుకు దోహదపడే టైగర్ దోమ రాత్రిపూట కాకుండా, పట్టపగలే స్వైర విహారం చేస్తుంది. నిల్వ నీటిలో పది రోజుల వ్యవధిలో సంతాన ఉత్పత్తి చేసుకుం టుంది. కాబట్టి ఇంటి చుట్టుపక్కల ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఇంట్లోనే మూలలో, చీకటి, చల్లని ప్రదేశాలలో టైగర్ దోమ నివాసం ఉండేందుకు ఎక్కువ ఆస్కారం ఉంది. కాబట్టి ఇల్లం తా వెలుతురుగా ఉండేలా జాగ్రత్తలు తీసుకవాలి. ఇంట్లోకి దోమలు రాకుండా తగు జాగ్రత్తలు పాటించా లి. డ్రమ్ముల్లో, ట్యాంకులలో ఇతర ప్రాంతాల్లో ఎక్కువ రోజులు నీటిని నిల్వ పెట్టకూడదు అని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లిల్లీ మేరి పేర్కొన్నారు.

## నేడు కొండగట్టుకు ఏపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

అమరావతి, జూన్ 28 :రేపు కొండగట్టుకు ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రానున్నారు. ఏపీ ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఆయన తన మొక్కులను తీర్చుకుంటున్నారు. ఈ క్రమంలోనే పవన్ రేపు కొండగట్టుకు రానున్నారు. కొండగటులోని ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు. కొండగట్టు అంజన్నను తమ ఇంటి ఇలవేల్పుగా పవన్ కల్యాణ్ భావిస్తూ ఉంటారు. గతంలో అంటే వారాహి యాత్రకి ముందు.. ఆ వాహనానికి తొలిపూజ కొండగట్టులోనే నిర్వహించారు. కూటమి పొత్తులను పవన్ కల్యాణ్ ప్రకటించింది కూడా కొండగట్టులోనే కావడం గమనార్హం.కాగా , మాధాపూర్ లోని నివాసం నుంచి రేపు ఉదయం 7 గంటలకు కారులో పవన్ కొండగట్టుకు బయలుదేరుతారు.. ఉదయం 11 గంటలకు కొండగట్టకు చేరుకుంటారు.. అక్కడ అంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయిస్తారు.. అనంతరం మధ్యాహ్నం 12.30కి అక్కడ నుంచి రోడ్డు మార్గంలో హైదరాబాద్ కు బయలు దేరుతాం..ఇక పవన్ పర్యటన నేపథ్యంలో సెక్యూరిటీ అధికా రులు ఇప్పటికే కొండగట్టుకు చేరుకు న్నారు.. పర్యటన ఏర్పాట్లు,భద్రతలపై వారు స్థానిక పోలీసులతో, ఇతర ఉన్నతాధికారులతో కలసి సమీక్షించారు..

# ఎన్నో పదవులను త్యాగం చేసిన చరిత్ర మనది..

## -సీఎం పదవి అనేది పెద్ద విషయం కాదు : కేసీఆర్



హైదరాబాద్, జూన్ 28 :తెలంగాణ సాధన అనే మహోన్నత లక్ష్యాన్ని సాధించిన.. అంతటి ఉదాత్తమైన లక్ష్యం కోసం ఎన్నో పదవులను త్యాగం చేసిన చరిత్ర మనది. తెలంగాణ సాధించిన ఘనత కన్నా నాకు సీఎం పదవి అనేది పెద్ద విషయం కాదు అని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కేసీఆర్ పునరుద్ఘటించారు.

తనను కలిసేందుకు ఎర్రవెల్లి నివాసానికి వందలాదిగా తరలివచ్చిన ప్రజలనుద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. "తెలంగాణ సాధించేనాటికి మనది సమైక్యపాలనలో దిక్కు మొక్కు లేని పరిస్థితి. సాగునీరు తాగునీరు కరెంటు వంటి అనేక కీలక వసతులను కల్పించుకున్నాం. తీర్చిదిద్దుకున్నాం. పదేండ్ల అనతికాలంలోనే తెలంగాణలో అద్భుతమైన ప్రగతిని సాధించుకున్నాం. ఇటువంటి కీలక సమయంలో వచ్చిన ఎన్నికల్లో ప్రజలు ఊహించని తీర్పునిచ్చారు. కొన్ని కొన్ని సార్లు ఇట్లాంటి తమాషాలు జరుగుతుంటాయని చరిత్రలోకి వెళితే అర్థమౌద్ది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అలవిగాని హామీలను నమ్మి ప్రజలు అనూహ్యంగా మోసపోయారు. "పాలిచ్చే బర్రెను వొదిలి దున్నపోతును తెచ్చుకున్నట్టు అయింది" అని పల్లెల్లో ప్రజలు బాధపడుతున్నారు" అని కేసీఆర్ వివరించారు.

### తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పాలనలో దారి తప్పింది..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించిన అనేక పథకాలు తమకు అందట్లేవని ప్రజలు ఆందోళన చెందుతున్నారని కేసీఆర్ అన్నారు. సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్, రైతు బంధు అందట్లేవన్నారు. తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరా సరిగా లేదన్నారు. ఇవన్నీ ప్రజల మనసుల్లో రికార్డ్ అవుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కష్టపడి దరికి తెచ్చిన తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పాలనలో దారి తప్పిందని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ఎటువంటి ఆందోళన చెందవద్దని కార్యకర్తలకు కేసీఆర్ భరోసా ఇచ్చారు.

### బీఆర్ఎస్‌ను గద్దె మీద కూర్చుండ బెట్టే రోజు త్వరలోనే వస్తుంది..

తెలంగాణ కోసం సాగిన మన 25 ఏండ్ల సుదీర్ఘ ప్రయాణం ఆగలేదు, అయిపోలేదు. నాడు ఎన్టీఆర్‌ని తిరిగి ఎట్లైతే ప్రజలు గద్దె మీద కూర్చో బెట్టారో అంతకన్నా గొప్పగా బీఆర్ఎస్ పార్టీని ప్రజలు తిరిగి ఆదరిస్తారని.. అంతకంటే రెట్టింపు మద్దతుతో మనలను గద్దె మీద కూర్చుండ బెట్టే రోజు త్వరలోనే వస్తుందని కార్యకర్తల హర్షధ్వానాల నడుమ అధినేత ప్రకటించారు.

### బీఆర్ఎస్ పార్టీకి బుల్లెట్ల వంటి కార్యకర్తలు

కాంగ్రెస్ ప్రభుత్వ పాలన రోజు రోజుకు దిగజారుతున్నదన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ నిచ్చెన మెట్లు ఎక్కేది పోయి మొదటి దశలోనే మెట్లు దిగజారుకుంటూ వస్తున్నదని విశ్లేశించారు. పార్టీ అనేది నాయకులను సృష్టిస్తదని, నాయకులు పార్టీలోకి వచ్చి పోతుంటారని కొంతమంది నాయకులు పార్టీని వీడినంత మాత్రాన పార్టీకి ఎటువంటి తేడా రాదని కేసీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి బుల్లెట్ల వంటి కార్యకర్తలున్నారని, వారినే నాయకులుగా తీర్చిదిద్దుకుందామని సందర్శకుల చప్పట్లు నడుమ ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీ బీ ఫాం ఇచ్చి అవకాశమిస్తే ఎవరైనా సిపాయిలుగా తయారౌతారని కేసీఆర్ తెలిపారు.

ప్రజల్లో చైతన్యం వచ్చి తమకు కాంగ్రెస్ ద్వారా జరిగిన మోసాన్ని గుర్తించి తిరిగి బీఆర్ఎస్‌ను ఆదరిస్తారని అప్పటిదాకా ఓపికతో ప్రజా సమస్యలపైన దృష్టి సారించాలని, పట్టుదలతో ప్రజల నడుమనే జీవించాలని కార్యకర్తలకు అధినేత పిలునిచ్చారు.

గురువారం ఆర్మూర్,హుజూరాబాద్ నియోజక వర్గాలకు చెందిన నేతలు కార్యకర్తలు వందలాదిగా ఎర్రవెల్లి లోని కేసీఆర్ నివాసానికి తరలివచ్చారు. తనను కలిసేందుకు వచ్చిన ప్రతీ ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారితో కేసీఆర్ ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు జహంగీర్, దుండిగల రాజేందర్, చైర్మన్లు, సర్పంచులు, తదితర ముఖ్యనేతలు పాల్గొన్నారు.

# సికింద్రాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మా చిన్ని స్టార్స్ సందడి



సికింద్రాబాద్, జూన్ 28 (ఏక ప్రెస్స్ న్యూ స్);వినోదం మరియు అభ్యాసం తో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో, సికింద్రాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఈ రోజు "మా చిన్ని స్టార్స్" స్టూడెంట్స్ తో కలిసి సందడి చేశారు. ఈ ఉత్సాహభరితమైన సందర్భంగా పాఠశాల ప్రాథమిక విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కొత్త టీవీ షో "చిన్ని"లోని ప్రియమైన పాత్రలైన చిన్ని మరియు కావేరితో ఆడి పాడారు. చిన్ని మరియు కావేరి సన్నిధి పిల్లలతో కలిసి ఉల్లాసంగా మరియు ఆనందాన్ని కలిగించే వాతావరణాన్ని సృష్టించింది, ఈ రోజును చిరస్మరణీయమైనదిగా మరియు విద్యావంతం చేసింది. విలువైన జీవిత పాఠాలను అందించడానికి రూపొందించిన వరుస ఆకర్షణీయమైన గేమ్‌లతో చిన్ని యువ ప్రేక్షకులను ఆకర్షించింది. ఈ ఉల్లాసభరితమైన వాతావరణంలో విద్యార్థులు తమ ఉపాధ్యాయులు చెపింది వినడం, వారి తల్లిదండ్రులను గౌరవించడం, పరీక్షలలో ఉతీరణ సాధిచడం పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు కావడం యొక్క ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా "తల్లి మరియు బిడ్డ" అనే అంశంపై జరిగిన పెయింటింగ్ పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పిల్లల కళాత్మక తో తల్లులు మరియు వారి పిల్లల మధ్య ప్రేమ మరియు బంధాన్ని అందంగా చిత్రీకరించాయి, కుటుంబాలు కలిసి భోజనం చేయడం, ఆప్యాయత ప్రదర్శించడం మరియు విలువైన క్షణాలను పంచుకునే దృశ్యాలను ప్రదర్శిస్తారు. విజేతలకు భాష మరియు అభ్యాసంపై వారి ప్రేమను పెంపొందించడం ద్వారా ఆక్స్‌ఫర్డ్ బుక్ ను ప్రదానం చేశారు. చిన్ని, తన ఆన్-స్క్రీన్ తల్లితో కలిసి, ప్రాథమిక పాఠశాల విద్యార్థులందరికీ స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. విశాలమైన చిరునవ్వులు మరియు ఆనందోత్సాహాలతో జరిగింది, ఈవెంట్ యొక్క సంతోషకరమైన స్ఫూర్తిని మరింత పెంచింది. చిన్నారులు కూడా చిన్నితో పాటలు పాడుతూ డ్యాన్స్‌లు చేస్తూ ఆనందాన్ని మరింత పెంచారు. ఈ మధురమైన క్షణంలో భాగం విద్యార్థులందరితో చిన్ని మరియు కావేరి సెల్ఫీ తీసుకోని పిల్లల్లో ఆనందాన్ని పెచారు. ఈ కార్యక్రమంలో పట్ల పిల్లల ఉత్సాహం మరియు ప్రేమ స్పష్టంగా కనిపించాయి, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఇది మరపురాని అనుభూతిని కలిగించింది."చిన్ని" సీరియల్ జూలై 1 నుండి స్టార్ మాలో రానుంది, ప్రతి రోజు సోమవారం నుండి శనివారం వరకు రాత్రి 7 గంటలకు ప్రసారం అవుతుంది. చిన్ని కొత్త సాహసాలను ఎదర్కొంటూ, అర్థవంతమైన సంబంధాలను ఏర్పరుచుకుని, తన తల్లిని జైలు నుండి విడిపించడానికి ప్రయత్నించే చిన్ని యొక్క జైలు గోడలపై సాగే ప్రయాణంపై కథ సాగుతోంది.

# మోదీ నేతృత్వాన మా సంపూర్ణ ప్రభుత్వం లక్ష్యంవైపు సాగుతోంది: కేంద్ర హోంమంత్రి

న్యూఢిల్లీ, జూన్ 28 : "అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం-అక్రమ రవాణా వ్యతిరేక దినం" నేపథ్యంలో దేశ ప్రజలకు కేంద్ర హోమ్-సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా పంపిన సందేశంలో- "అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం-అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా ప్రజలందరికీ నా శుభాకాంక్షలు. భారతదేశాన్ని మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దే దిశగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని మా ప్రభుత్వం దృఢమైన నిబద్ధతను ప్రదర్శిస్తోంది. ఈ లక్ష్యం దిశగా 'సంపూర్ణ ప్రభుత్వం' విధానంతో ముందడుగు వేస్తోంది. మాదకద్రవ్య మహమ్మారి నుంచి దేశాన్ని విముక్తం చేయడంతోపాటు మన భవిష్యత్తరాలకు మెరుగైన ప్రపంచాన్ని కానుకగా ఇవ్వడంపై మన సంకల్పాన్ని మరింత దృఢంగా ప్రకటిద్దాం" అని పిలుపునిచ్చారు.

శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో 'మాదకద్రవ్య రహిత భారత్' దిశగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని శ్రీ అమిత్ షా స్పష్టం చేశారు. ఈ మేరకు 'అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం-అక్రమ రవాణా వ్యతిరేక దినం' నేపథ్యంలో పంపిన తన సందేశంలో: 'మాదకద్రవ్య రహిత భారత్' దిశగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంకల్పాన్ని సాకారం చేయడంలో నిర్విరామంగా శ్రమిస్తున్న ప్రభుత్వ సంస్థలు-సిబ్బందికి శ్రీ అమిత్ షా అభినందనలు తెలిపారు. ఇందులో భాగంగా 'అఖిలభారత మాదకద్రవ్య రహిత పక్షోత్సవాల'ను విజయవంతంగా నిర్వహించిన నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి)ని ఆయన ప్రశంసించారు.

మాదకద్రవ్యాలు వ్యక్తులతోపాటు యావత్ సమాజానికి, అంతిమంగా దేశ భద్రతకే సవాలు విసురుతున్నాయని శ్రీ అమిత్ షా గుర్తుచేశారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో 'మాదకద్రవ్య రహిత భారత్' రూపకల్పన తమ ప్రభుత్వ అగ్ర ప్రాథమ్యాలలో ఒకటిగా ఉందని పేర్కొన్నారు. మాదకద్రవ్యాలపై పోరులో భాగంగా 'దిగువ నుంచి ఎగువకు-ఎగువ నుంచి దిగువకు' విధానం అమలులో మోదీ ప్రభుత్వం మెరుగైన సమన్వయం సాధించిందని ఆయన చెప్పారు.

మాదకద్రవ్యాలపై 'సంపూర్ణ నిరోధం' విధానంతో ముందడుగు వేస్తున్నామని కేంద్ర హోంమంత్రి తెలిపారు. ముఖ్యంగా మాదకద్రవ్య వ్యసనాన్ని పూర్తిగా నిర్మూలించడంపై ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. హోం మంత్రిత్వ శాఖ కృషితోపాటు 'ఎన్‌సిఒఆర్‌డి' ఏర్పాటు, రాష్ట్రాల పోలీసు విభాగాల్లో 'యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్' ఏర్పాటుతో ఈ పోరాటం మరింత ఉధృతమై సానుకూల ఫలితాలిచ్చిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

మాదకద్రవ్య నియంత్రణపై ప్రభుత్వం చేపట్టిన అన్నిరకాల సానుకూల చర్యలకు భారీ ప్రజా భాగస్వామ్యం తోడ్పాటుతో సంపూర్ణ విజయం సాధించడమే తమ లక్ష్యమని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. ఆ మేరకు "మాదకద్రవ్యాలపై ప్రభుత్వ పోరాటానికి దేశ ప్రజలు తమవంతు సహకారం అందించాలని అభ్యర్థిస్తున్నాను. మనమంతా సమష్టి కృషితో మాదక ద్రవ్యాల సంపూర్ణ నిర్మూలన ద్వారా ఆరోగ్యకర.. సంతోషభరిత.. సురక్షిత సమాజ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేద్దాం రండి" అని పిలుపునిచ్చారు.

చట్టవిరుద్ధ మాదకద్రవ్య వ్యాపారం నిరోధం దిశగా కేంద్ర హోంశాఖ బహుముఖ కృషి ఫలితంగా స్వాధీనం చేసుకుంటున్న మాదకద్రవ్యాల పరిమాణం దాదాపు 100 శాతం పెరిగింది. అంతేకాకుండా ఈ అక్రమ కార్యకలాపాలపై కేసుల నమోదు 152 శాతం పెరిగింది. ఈ అంశాలపై మంత్రిత్వశాఖ వెల్లడించిన సమాచారం ప్రకారం- దేశంలో 2006-13 మధ్య కాలంలో 1,257 కేసులు నమోదు కాగా, 2014-23 మధ్య 3 రెట్లు పెరిగి 3755 నమోదయ్యాయి. అలాగే అరెస్టులు కూడా 2006-13 మధ్య 1363 సంఘటనలు నమోదవగా, 2014-23 మధ్య కాలంలో 4 రెట్లు పెరిగి 5745కి చేరాయి. ఇక 2006-13 మధ్యకాలంలో 1.52 లక్షల కిలోల మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకోగా, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో ఇప్పటిదాకా ఈ పరిమాణం రెట్టింపు పెరిగి 3.95 లక్షల కిలోలకు చేరింది. ఇలా స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాల విలువ పరంగానూ 2006-13 మధ్య రూ.768 కోట్లు కాగా, మోదీ ప్రభుత్వ హయాంలో 30 రెట్లు పెరిగి రూ.22,000 కోట్లకు చేరింది.

అంతేకాకుండా మోదీ ప్రభుత్వ హయాంలో రూ.12,000 కోట్ల విలువైన 12 లక్షల కిలోల మాదకద్రవ్యాలను యాంటీ నార్కోటిక్ సంస్థలు ధ్వంసం చేశాయి. మరోవైపు 2023 జూన్ వరకూ ఇటువంటి 23 ఉదంతాల్లో రూ.74,75,00,531 విలువైన ఆస్తులను స్తంభింపజేశాయి.

# ఘనంగా మాజీ ప్రధాని పీవీ నర్సింహ రావు 103 వ జయంతి ఉత్సవాలు




హైదరాబాద్ జూన్ 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );:: భారత రత్న, మాజీ ప్రధాని పీవీ నర్సింహ రావు 103 వ జయంతి ఉత్సవాలు హైదరాబాద్ నెక్లెస్ రోడ్ పీవీ మార్గ్ లోని జ్ఞాన్ భూమిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరై పీవీ ని ఘనంగా స్మరించుకున్నారు. జ్ఞాన భూమి ని సందర్శించి పీవీ నర్సింహా రావుకు ఘనంగా నివాళులు అర్పించిన వారిలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి, హై కోర్ట్ జడ్జి ఔప శ్రవన్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కరే వేణుగోపాల్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణ మోహన్ రావు, పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ వాణి దేవి, కుమారుడు పీవీ ప్రభాకర్ రావు, జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాటా, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హనుమంత రావు, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, మాజీ మంత్రి కుందూరు జానా రెడ్డి కోదండ రామ్, వీ. హనుమంత రావు, తదితరులు ఉన్నారు.

# జులై 1 నుంచే కొత్త నేర న్యాయ చట్టాలు

న్యూఢిల్లీ జూన్ 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: సీఆర్పీసీ, ఐఈఏ చట్టాల స్థానంలో ఇటీవల కొత్తగా తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత 2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత 2023, భారతీయ సాక్ష అధినియమ్ 2023 పేరుతో మూడు చట్టాలు జులై 1 నుంచి దేశ వ్యాప్తంగా అమలులోకి రానున్నాయి. భారతీయ న్యాయ సంహిత-2023, భారతీయ సాక్ష్య బిల్లు-2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత-2023లు 1860 నాటి భారతీయ శిక్షాస్మృతి, క్రిమినల్ ప్రొసీజర్ (అతీఖఅ) కోడ్ -1973, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్- 1872 స్థానాలను భర్తీ చేయనున్నాయి.వీటికి 2023లో పార్లమెంట్ ఆమోదం తెలిపింది. డిసెంబర్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తర్వాత చట్టాలుగా మారాయి. జాతీయ భద్రతకు ప్రమాదకరమైన టెర్రరిజం, కొట్టిచంపడం వంటి నేరాలకు కఠిన శిక్షలను ఈ చట్టాలు నిర్దేశిస్తున్నాయి. ఏడేళ్లు, అంతకు పైబడి శిక్ష పడిన నేరాల్లో ఫోరెన్సిక్ తప్పనిసరని ఈ చట్టాలు చెబుతున్నారు.భారతీయ న్యాయ సంహితలో 20 కొత్త నేరాలు చేర్చగా, ఎఖఅలో ఉన్న 19 నిబంధనలను తొలగించారు. 33 నేరాల్లో జైలు శిక్షను పెంచారు. 83 నిబంధనలలో జరిమానా పెంచగా.. 23 నేరాలలో తప్పనిసరి కనీస శిక్షను ప్రవేశపెట్టారు. ఆరు నేరాల్లో సమాజసేవను శిక్షగా మార్చారు. కొత్త చట్టాలు భారతీయత, భారత రాజ్యాంగం, ప్రజల శ్రేయస్సుకు ప్రాధాన్యతనిస్తాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా గతంలో చెప్పారు. మూడు చట్టాల పరిధిలోని అన్ని వ్యవస్థలు అమల్లోకి వస్తే ఐదేళ్లలో భారత నేర న్యాయ వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత అధునాతనంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు.జీరో ఎఫ్ఆర్, ఆన్లైన్లో పోలీస్ ఫిర్యాదు, ఎలక్ట్రానిక్ రూపంలోనే సమన్లు, దారుణమైన నేరాలకు సంబంధించి నేరం జరిగిన ప్రదేశాన్ని తప్పనిసరిగా వీడియో చిత్రీకరించడం వంటివి కీలక అంశాలుగా ఇందులో ఉండనున్నాయి. ఈ కొత్త చట్టాల ప్రకారం పోలీస్ స్టేషన్కు వెళ్లనవసరం లేకుండానే ఆన్లైన్లో ఫిర్యాదు చేసే వీలు కలుగనుంది. తద్వారా తేలికగా, వేగంగా సమస్యను తెలియజేయడంతోపాటు। పోలీస్ స్పందనను సులభతరం చేస్తుంది.ఏదైనా సంఘటన సమాచారాన్ని ఏ పోలీస్ స్టేషన్ కైనా ఆన్లైన్ తెలియజేయవచ్చు. జీరో ఎఫ్ఐఆర్ ప్రకారం? ఏ వ్యక్తి అయినా పోలీస్ స్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఏ పోలీస్ స్టేషన్లోనైనా ఫిర్యాదు చేయవచ్చు. బాధితులతోపాటు నిందితులు కూడా ఎన్ఐఆర్ కాపీలను ఉచితంగా పొందే వీలుంది. వీటితోపాటు పోలీస్ రిపోర్టు,సాక్షాలు తారుమారు కాకుండా ఉండేందుకు నేరం జరిగిన ప్రదేశంలో ఆధారాలు సేకరించేక్రమాన్ని వీడియో చిత్రీకరించాలి. పిల్లలు, మహిళలపై నేరాల్లో బాధితులకు ప్రాథమిక చికిత్స లేదా పూర్తి వైద్యం ఉచితంగా అందించాల్సి ఉంటుంది. అత్యాచార నేరాల కేసుల్లో బాధితురాలి వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో ద్వారా పోలీస్ లు నమోదు చేయాలి.మహిళలు, దివ్యాంగులు, దీర్ఘకాల వ్యాధిగ్రస్థులతోపాటు 15ఏళ్ల లోపు పిల్లలు, 60 ఏళ్ల కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు పోలీస్ స్టేషను వెళ్లడం నుంచి మినహాయింపు ఉంటుంది. వారు నివాసం ఉన్న చోటే పోలీస్ల సాయం పొందవచ్చు. స్వల్ప నేరాలకు సంబంధించి నేరస్థులకు సమాజసేవ చేసే అవకాశాన్ని కొత్త చట్టాలు కల్పిస్తున్నాయి.బ్రిటిష్ వలస పాలన నాటి ఐపిసి, ఛార్జిషీట్, స్టేట్మెంట్లు ఇతర డాక్యుమెంట్లు, 14 రోజుల్లోగా పొందవచ్చు. అరెస్ట్ సందర్భాల్లో, బాధితుడు తమ సన్నిహితులు, బంధువులకు, ఆ పరిస్థితిని తెలియజేసే హక్కు ఉంటుంది. తద్వారా తక్షణ సహాయం పొందేందుకు వీలు కలుగుతుంది. తీవ్రమైన నేరాల్లో ఫోరెన్సిక్ నిపుణులు తప్పనిసరిగా సంఘటన స్థలాన్ని పరిశీలించాలి.

# తిరుమలలో శారదా పీఠం భవనం కూల్చాల్సిందే- శ్రీనివాసానంద సరస్వతి



తిరుపతి,జూన్ 28 :తిరుమల పవిత్రతను కాపాడేందుకు ఎంతటి త్యాగానికైనా సిద్ధమని ఏపీ సాధు పరిషత్తు అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి అన్నారు.

తిరుమలలోని విశాఖ శారదా పీఠం ఆక్రమణలను ఏపీ సాధు పరిషత్తు స్వామీజీలు పరిశీలించారు.

అనంతరం శ్రీనివాసానంద సరస్వతి మీడియాతో మాట్లాడుతూ "తిరుమలలో విశాఖ శారదా పీఠాన్ని వ్యాపార పీఠంగా మార్చేశారు.

ఇక్కడ ఒక్కరికీ అన్నం పెట్టడం లేదు.. పూజలు చేయడం లేదు. 4 అంతస్తులకు అనుమతి ఇస్తే.. 6 అంతస్తుల నిర్మాణం చేపట్టారు. గదులను భక్తులకు అధిక ధరలకు విక్రయించి దోపిడీకి పాల్పడుతున్నారు. 10వేల చదరపు గజాల్లో అక్రమ కట్టడాలు నిర్మించారు

. శారదా పీఠం ఆక్రమణలు కూల్చకపోతే ప్రాణ త్యాగానికైనా సిద్ధం" అని హెచ్చరించారు.

# ఆన్‌లైన్ ఆర్థిక కుంభకోణాలకు పాల్పడుతున్న భారతీయుల ముఠా అరెస్ట్

కొలంబో జూన్ 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఆన్‌లైన్ ఆర్థిక కుంభకోణాలకు పాల్పడుతున్న ముఠాలో సభ్యులైన 60 మంది భారతీయులను శ్రీలంకకు చెందిన క్రిమినల్ ఇన్వెస్టిగేషన్స్ డిపార్ట్‌మెంట్(సిఐడి) అరెస్టు చేసింది. శ్రీలంక రాజధాని కొలంబో నగర శివార్లలోని మడివేలా, పట్టరముల్లాతో పాటు పశ్చిమ కోస్తా పట్టణం నెగొంబో నుంచి వీరిని గురువారం అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు అధికార ప్రతినిధి ఎస్ఎస్పి నిహాల్ తల్దువా శుక్రవారం తెలిపారు. ఈ ప్రాంతాలలో ఏకకాలంలో దాడులు జరిపిన సిఐడి అధికారులు ముఠా సభ్యులను అరెస్టు చేయడంతోపాటు వారి నుంచి 135 మొబైల్ ఫోన్లను, 57 లాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. సోషల్ మీడియా చాటింగ్‌ల కోసం డబ్బు ముట్టచెబుతామని వాగ్దానం చేసి వాట్సాప్ గ్రూపులో చేరేందుకు ప్రలోభపెట్టి తనను మోసం చేశారని ఒక బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు సిఐడి అధికారులు ఈ దాడులు జరిపారు. నొగొంబోలోని ఒక విలాసవంతమైన భవనంపై జరిపిన దాడిలో కీలక ఆధారాలు లభించడంతోపాటు 13 మంది అనుమానితుల అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు. వారి నుంచి 57 మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. నొగొంబోలో జరిపిన దాడి తదుపరి మరో 19 మందిని అరెస్టు చేశారు. ఈ ముఠాకు దుబాయ్, అఫ్ఘానిస్తాన్‌లో అంతర్జాతీయ సంబంధాలు ఉన్నట్లు తెలిసింది. బాధితులలో స్థానకులతోపాటు విదేశీయులు కూడా ఉన్నారు. ఆర్థిక మోసాలు, చట్టవిరుద్ధ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ వంటి వివిధ నేరాలకు ఈ ముఠా పల్పాడినట్లు సిఐడి అనుమానిస్తోంది.

# భారత్‌లో మైనారిటీలపై ద్వేషం పెరుగుతోందన్న అమెరికా.. తోసిపుచ్చిన ఇండియా

న్యూఢిల్లీ, జూన్ 28 :భారత్‌లో మైనారిటీలపై ద్వేషం పెరుగుతోందని మత స్వేచ్ఛపై ఆమెరికా విదేశాంగ శాఖ ఒక నివేదికను విడుదల చేసింది. అమెరికా విదేశాంగ శాఖ విడుదల చేసిన ఈ నివేదికను భారత్ తోసిపుచ్చింది.

మత స్వేచ్ఛపై అమెరికా విడుదల చేసిన నివేదికను తిరస్కరిస్తున్నామని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు.

అమెరికా నివేదికలో చాలా పక్షపాతం ఉందని, భారతదేశ సామాజిక నిర్మాణంపై అవగాహన లేకుండా అమెరికా ప్రత్యేక కథనాన్ని రూపొందించిందని జైస్వాల్ మండిపడ్డారు. భారతీయ న్యాయస్థానాలు ఇచ్చిన కొన్ని చట్టపరమైన తీర్పుల సమగ్రతను కూడా ఈ నివేదిక సవాలు చేసేలా కనిపిస్తోందని ఆయన అన్నారు.

కాగా భారత్‌లో మైనారిటీలపై ద్వేషం పెరుగుతోందని అమెరికా బుధవారం రిలీజియస్ ఫ్రీడం రిపోర్టును విడుదల చేసింది. భారతదేశంలో మైనారిటీ వర్గాలపై హింసాత్మక దాడులు జరుగుతున్నాయని ఆ నివేదికలో పేర్కొంది.

ఇది మే 2023లో మణిపూర్‌లో ప్రారంభమైన హింసను కూడా ప్ర'అమెరికా నివేదిక తీవ్ర పక్షపాతంతో కూడుకున్నది. భారతదేశ సామాజిక నిర్మాణంపై అవగాహన లేదు. కాబట్టి మేము దానిని తిరస్కరిస్తున్నాం. ఈ నివేదికలో ఆరోపణలు, తప్పుడు అంశాలు, అసత్యాలు, పక్షపాత మూలాలు ఉన్నట్లు కనిపిస్తోంది. ఇది ఏకపక్ష అంచనాల మిశ్రమం' అని జైస్వాల్ వ్యాఖ్యానించారు.

# కర్నూలును అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా.. కలెక్టర్

## -రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక అమలు



అమరావతి, జూన్ 28 :ప్రజా ప్రతినిధులు, జిల్లా ప్రజల సహకారంతో కర్నూలు జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు.

శుక్రవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ఉదయం 10.15 గంటలకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పదవీ బాధ్యతలను స్వీకరించారు. అనంతరం మత పెద్దలు సర్వమత ప్రార్థనలు నిర్వహించి కలెక్టర్ ను ఆశీర్వదించారు..

బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ ఈరోజు కర్నూలు జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కర్నూలు జిల్లా తనకు సొంత జిల్లా లాగా అని, తన స్వస్థలం నందికొట్కూరు నియోజకవర్గమని, తన విద్యాభ్యాసం కొంత వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే జరిగిందన్నారు. దాదాపు 20 సంవత్సరాల కిందట ఉద్యోగ రీత్యా కర్నూలు జిల్లాను విడిచి వెళ్లడం జరిగిందని, మరలా 20సంవత్సరాల తర్వాత జిల్లా కలెక్టర్ గా సొంత జిల్లాకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ప్రజా ప్రతినిధులు, జిల్లా ప్రజల సహకారంతో జిల్లా అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుని అమలు చేస్తానని, జిల్లా ప్రజలందరికీ మేలు చేకూరే విధంగా జిల్లా అడ్మినిస్ట్రేషన్ తరపున తీసుకోవాల్సిన అన్ని రకాల చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు..అనంతరం నూతన కలెక్టర్ కు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్ఓ మధుసూదన్ రావు, జిల్లా అధికారులు, తదితరులు పుష్పగుచ్చాలతో అభినందనలు తెలిపారు.

# రెండు లారీలు ఢీ - నలుగురు దుర్మరణం

మెదక్, జూన్ 28 :మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. రెండు లారీ ఢీ కొట్టడంతో నలుగురు దుర్మరణం పాలయ్యారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

చేగుంట 44వ జాతీయ రహదారి వడియారం బైపాస్ వద్ద ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వస్తున్న మరో లారీ వేగంగా ఢీ కొట్టింది. వెనుకల లారీలో ఉన్న అక్కడికక్కడే నలుగురు చనిపోగా.. తీవ్రంగా గాయపడ్డ మరో నలుగురిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆ నలుగురి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.

# భారత విదేశాంగ కార్యదర్శిగా విక్రమ్ మిస్రీ.. జూలై 15న బాధ్యతల స్వీకారం

హైదరాబాద్, జూన్ 28 :భారత జాతీయ డిప్యూటీ భద్రతా సలహాదారుగా ఉన్న విక్రమ్ మిస్రీ ని భారత విదేశాంగ శాఖ కార్యదర్శి గా నియమించారు. ఈ నియామకానికి కేంద్ర క్యాబినెట్ అప్పాయింట్‌మెంట్స్ కమిటీ ఆమోదం తెలిపింది. జూలై 15న విక్రమ్ మిస్రీ విదేశాంగ కార్యదర్శిగా బాధ్యతలు ప్రస్తుతం భారత విదేశాంగ కార్యదర్శిగా పనిచేస్తున్న వినయ్ క్వాట్రా (ఎతినిజీఏ ఐలిజీబితీజీ) పదవీకాలం 2024 ఏప్రిల్ 30తో ముగిసింది. ఆయన పదవీకాలాన్ని ఏప్రిల్ 30 నుంచి జూలై 14 వరకు పొడిగిస్తూ కేంద్రం 2024 మార్చి 12 ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు ఆయన జూలై 14 వరకు విదేశాంగ కార్యదర్శిగా కొనసాగనున్నారు. ఆ తర్వాత జూలై 15న మిస్రీ ఆయన నుంచి బాధ్యతలు తీసుకోనున్నారు.

# మాజీ ప్రధాని పీవీకి ఘన నివాళులు అర్పించిన కాంగ్రెస్ నేతలు



ఖమ్మం, జూన్ 28 :(నేటినిజం ప్రతినిధి): మాజీ ప్రధాన మంత్రి పీవీ.నరసింహా రావు 103వ జయంతిని పురస్కరించుకొని ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ కాంగ్రెస్ నేతలతో కలిసి శుక్రవారం లకారం జంక్షన్ లోని పీవీ.నరసింహారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు, ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నగర మేయర్ నీరజ మాట్లాడుతూ... జాతీయ రాజకీయాలలో అపర చాణక్యుడిగా పేరొందారని తెలిపారు. పీవీ తన సరళీకృత ఆర్థిక విధానాలతో ఆధునిక భారత నిర్మాణానికి బాటలు వేశారని చెప్పారు. బహుభాషా కోవిధుడని, బహుముఖ ప్రజ్ఞాశాలి అని అన్నారు. దేశం పక్షాన గొప్ప ఆర్థిక వేత్తగా నిలిచారని, ఆయన ఆశయ సాధనకు అంతా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్ ఆళ్ల నిరీష రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కమతం రామకృష్ణ, తోట ప్రసాద్, సరిపూడి సతీష్, ఆళ్ల అంజి రెడ్డి, ప్రతిభా రెడ్డి, ప్రశాంతి, కూచిపూడి జై తదితరులు పాల్గొన్నారు.

# సర్కార్ మొండి వైఖరితోనే ఖర్గే వెల్‌లోకి రావాల్సి వచ్చింది : జైరాం రమేష్

న్యూఢిల్లీ, జూన్ 28 :: రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే సభ వెల్‌లోకి దూసుకురావడంపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ వివరణ ఇచ్చారు. ఖర్గే వంటి సీనియర్ నేతను మాట్లాడేందుకు ఈరోజు అనుమతించలేదని అన్నారు. పేపర్ లీక్‌లు, నీట్ వంటి ఘటనలను ముందుగా చర్చకు చేపట్టాలని మాత్రమే తాము కోరామని చెప్పారు. ఖర్గే చేతిని పైకిలేవి చర్చకు పట్టుబట్టినా సభాధ్యక్షుడు పట్టించుకోలేదని అన్నారు.

పదేపదే విజ్ఞప్తి చేసినా విస్మరించడంతో విధిలేని పరిస్థితుల్లో ఖర్గే వెల్‌లోకి రావాల్సిన పరిస్థితి ఎదురైందని పేర్కొన్నారు. విపక్ష నేత ఎన్నడూ వెల్‌లోకి దూసుకురాలేదని చెబుతున్నారని, జమ్ము కశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దుకు సంబంధించిన బిల్లు చేపట్టినప్పుడు అప్పటి విపక్ష నేత గులాం నబీ ఆజాద్ నిరసనగా వెల్‌లోకి వచ్చారని గుర్తుచేశారు.

తనను మాట్లాడేందుకు అనుమతించాలని ఇవాళ ఖర్గే రాజ్యసభ ఛైర్మన్‌ను పదేపదే కోరినా పట్టించుకోలేదని ఆరోపించారు. నాలుగైదు గంటలు నీట్ వ్యవహారంపై చర్చించి విద్యాశాఖ మంత్రి ప్రకటన ఇచ్చిఉంటే సరిపోయేదని కానీ పాలకపక్షం మొండివైఖరితో వ్యవహరించిందని పేర్కొన్నారు. ఖర్గే వెల్‌లోకి రావాల్సిన పరిస్థితిని పాలక పక్షమే కల్పించిందని దుయ్యబట్టారు.

మరోవైపు పాతిక లక్షల మంది విద్యార్థుల భవితవ్యానికి సంబంధించిన నీట్ వ్యవహారంపై చర్చించేందుకు తాము పట్టుబట్టినా ప్రభుత్వం స్పందించలేదని అంతకుముందు రాజ్యసభ విపక్ష నేత ఖర్గే పేర్కొన్నారు. తనను మాట్లాడేందుకు అనువతించాలని ఎన్నిసార్లు కోరినా రాజ్యసభ ఛైర్మన్ పట్టించు కోకపోవడంతో తాను వెల్‌లోకి వెళ్లానని ఆయన వివరణ ఇచ్చారు.

# నల్లగొండ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డిపై నెగ్గిన అవిశ్వాస తీర్మానం



నల్గొండ, జూన్ 28 :ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డిపై డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన గొంగిడి మహేందర్ రెడ్డిని చైర్మన్ పదవి నుంచి తొలగించాలని కోరుతూ 14 మంది డైరెక్టర్లు కొద్దిరోజుల క్రితం డీసీఓ కిరణ్ కుమార్ కు అవిశ్వాస తీర్మానాన్ని ఇచ్చారు.

డైరెక్టర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం మేరకు శుక్రవారం ఉదయం 11 గంటలకు నల్లగొండ డీసీసీబీ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించగా 15మంది డైరెక్టర్లు మహేందర్ రెడ్డికి వ్యతిరేకంగా ఓటు వేశారు. దీంతో మహేందర్ రెడ్డి పదవి కోల్పోయినట్లు అయింది. నూతన చైర్మన్ ఎంపిక కోసం త్వరలో ఓటింగ్ నిర్వహించనున్నట్లు డీసీఓ తెలిపారు.

నూతన చైర్మన్ గా శ్రీనివాస్ రెడ్డి : నల్లగొండ జిల్లా నూతన డీసీసీబీ చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీకి చెందిన శ్రీనివాస్ రెడ్డి నియామకం కానున్నారు.






# టెన్త్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలు వెల్లడి..

హైదరాబాద్, జూన్ 28 :తెలంగాణ పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. పరీక్షల్లో 46,731మందికి గాను 34,126మంది ( 73.03శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు వెల్లడించారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ దరఖాస్తులకు జులై 8వరకు అవకాశం కల్పించారు. ఈ ఫలితాలను విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ ఎబవ.బివశ్రీజీనిణజీనిజీ.ణనీల.తిని లో చూసుకోవచ్చు.కాగా, వార్షిక పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయి. ఇక పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో 91.31 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 93.23 శాతం బాలికలు, 89.42 శాతం బాలురు ఉత్తీర్ణత సాధించారు. 3,927 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత కాగా.. ఆరు పాఠశాలల్లో జీరో శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇక గతేడాది వార్షిక పరీక్షలో 89.60 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. ఈ ఏడాది 91.31 శాతానికి పెరిగింది

# పర్యావరణహితం లక్ష్యంగా బిజెపి పార్టీ ఆద్వర్యంలో అమ్మ పేరుతో ఒక్క చెట్టు

## -తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 5 లక్షల మొక్కలు నాటేలా లక్ష్యం

## -పార్టీ బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీనారాయణ




హైదరాబాద్ జూన్ 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్);డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ గారి బలిదాన్ దివస్ సందర్భంగా దేశ వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ పర్యావరణహితం లక్ష్యంగా అమ్మ పేరుతో మొక్కలు నాటేలా గొప్ప కార్యక్రమానికి పిలుపునిచ్చింది.శుక్రవారం పార్టీ కార్యాలయం లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశం లో పార్టీ బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీనారాయణ పార్టీ అధికార ప్రతినిధి రాని రుద్రమ,యువమోర్చ రాష్ట్ర అధ్యక్షులు మహేందర్ తో కలిసి మాట్లాడారు.ఇందులో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 5 లక్షల మొక్కలు నాటేలా లక్ష్యాన్ని నిర్ధారించడం జరిగిందని చెప్పారు.జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున భారత ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీలోని బుద్ధ జయంతి పార్కులో ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో ఒక్క చెట్టు ) పేరుతో ఒక మొక్కను నాటారు.కాశ్మీర్ కోసం శ్యామ ప్రసాద్ ముఖర్జీ గారు 1953, జూన్ 23న బలిదానమయ్యారు.తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ప్రభుత్వంలో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ గారు మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.1949లో నెహ్రూ పాకిస్థాన్ ప్రధానమంత్రి లియాఖత్ అలీ ఖాన్‌తో జరిపిన ఢిల్లీ ఒప్పందం (ఆర్టికల్ 370) అనంతరం ఏప్రిల్ 6, 1950 న ముఖర్జీ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి, బయటికి వచ్చారు.1951 అక్టోబరు 21న భారతీయ జనసంఘ్ పార్టీని స్థాపించి, 1952లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల్లో కోల్‌కతా పార్లమెంట్ స్థానం నుంచి ఎన్నికయ్యారు.కశ్మీర్‌కు ప్రత్యేక రాజ్యాంగం, అధికారాలు, స్వయం ప్రతిపత్తిని ముఖర్జీ గారు తీవ్రంగా వ్యతిరేకించారు.

జమ్మూ కశ్మీర్ స్వయం ప్రతిపత్తి రద్దు(ఆర్టికల్-370) కోసం అవిశ్రాంతంగా పోరాడి, దేశ సమగ్రత కోసం శ్రమించారు.డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ గారి బలిదాన్ దివస్ సందర్భంగా, ఆ మహనీయుడి సేవలను స్మరించుకునేలా మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేసేలా భారతీయ జనతా పార్టీలో వివిధ కమిటీలను నియమించడం జరిగింది.జూన్ 29, 30 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సమావేశాలు నిర్వహించి, ఆ సమావేశాల్లో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ గారు దేశం కోసం చేసిన బలిదానం గురించి ప్రజలకు వివరించడంతో పాటు ప్రజలకు మొక్కలు పంపిణీ చేస్తాం.జులై 5, 6 తేదీల్లో జిల్లా కేంద్రాల నుంచి మండల స్థాయిలోని శక్తి కేంద్రాలకు పార్టీ శ్రేణులు వెళ్లి ప్రతి బూత్ స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని అమలు చేస్తాం.నరేంద్ర మోదీ ప్రభుత్వం 2019లో ఆర్టికల్ 370 ను తొలగించి జమ్మూ కాశ్మీర్‌ను భారతదేశంలో కలపడం ద్వారా దేశాన్ని ఒక బలమైన? ఐక్య దేశంగా చూడాలనే డాక్టర్ ముఖర్జీ కలను సాకారం చేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి బూత్ పరిధిలో పది చొప్పున మొక్కలు

అనంతరం బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ మాట్లాడుతూ డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ గారి బలిదాన్ దివస్ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి బూత్ పరిధిలో పది చొప్పున మొక్కలు నాటాలని పార్టీ నిర్ణయించింది.రాష్ట్ర కార్యాలయంలో భారతీయ జనతా పార్టీకి చెందిన వివిధ మోర్చాల నుంచి కమిటీలు ఏర్పాటు చేసి, కమిటీ సభ్యుల నుంచి ప్రజలకు మొక్కలు వితరణ చేయాలని పార్టీ నిర్ణయించింది. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ గారి జీవిత విశేషాలు, కశ్మీర్ కోసం వారు చేసి బలిదానం, దేశం కోసం త్యాగం చేసిన ముఖర్జీ గారి సేవలను స్మరించుకునేలా వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యమై విజయవంతం చేసేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేసారు.

# హరీశ్ రావుకు అచ్చంపేట ఎమ్మెల్యే ఓపెన్ సవాల్



మహబూబ్‌నగర్, జూన్ 28 :మాజీ మంత్రి హరీశ్ రావుకు అచ్చంపేట ఎమ్మెల్యే ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఓపెన్ సవాల్ విసిరారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత గ్రామంలో బీజేపీకి మెజార్టీ ఎలా వచ్చిందని మాజీ మంత్రి హరీష్ రావు విచక్షణ రహితంగా నిరాధారంపైన ఆరోపణలు చేయడం మాని, తన ఆరోపణలను నిరూపించాలని, లేదంటే హరీష్ రావు శాశ్వతంగా రాజకీయాల నుండి తప్పుకోవాలని, హరీష్ రావు చేసిన ఆరోపణలు నిజమని నిరూపించినట్లయితే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు.

శుక్రవారం అచ్చంపేట పట్టణం లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రజా భవన్ లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ? సీఎం రేవంత్ రెడ్డి సొంత గ్రామంలో బీజేపీకి మెజార్టీ అధికంగా వచ్చిందని హరీష్ రావు చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. హరీష్ రావు లాంటి నాయకుడు తన స్థాయికి మించి ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రెడీమేడ్ గా చేసుకున్న సిద్దిపేటలో రెడీమేడ్ నాయకునిగా పోటీ చేసిన నువ్వు గెలవకముందుకే మంత్రిగా ఎలా ప్రమాణస్వీకారం చేయగలిగావని సూటిగా ప్రశ్నిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాక్షేత్రంలో ప్రజల నుండి పుట్టుకొచ్చిన నాయకుడని జెడ్పిటిసిగా ప్రస్థానం మొదలుపెట్టి ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా అంచలంచలుగా ఎదుగుతూ ప్రజా ఆశీర్వాదంతో నేడు ముఖ్యమంత్రి స్థాయిని చేరుకున్నారని ఫైర్ అయ్యారు.

హరీశ్ రావు ఆరోపిస్తున్నట్టు ముఖ్యమంత్రి స్వగ్రామం కొండారెడ్డి పల్లిలో బూత్ నెంబర్ 15లో బీఆర్ఎస్ కు 131 ఓట్లు వస్తే బీజేపీకి 103 ఓట్లు రాగా, కాంగ్రెస్ పార్టీకి 694 ఓట్లు వచ్చాయని, అలాగే బూతు నెంబర్ 16 లో బీఆర్ఎస్ కు 65 ఓట్లు వస్తే బీజేపీకి 135 ఓట్లు రాగా, కాంగ్రెస్ పార్టీకి 527 ఓట్లు వచ్చాయని, మొత్తానికి 983 ఓట్ల మెజార్టీ కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ వచ్చిందని ఎన్నికల అధికారులు ఇచ్చిన పత్రాలను చూపిస్తూ.. తాను చూయించిన ఓట్లలో ఒక్క ఓటు అటు ఇటుగా ఉన్నట్లు నిరూపించినా.. తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే వంశీకృష్ణ సవాల్ విసిరారు.రానున్న రెండు నెలల్లో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగైపోవడం ఖాయమని, ఆ పార్టీని బీజేపీ పార్టీలో విలీనం చేయక తప్పదని ఆ క్రమంలోనే హరీశ్ రావును ముందుగా బీజేపీ పార్టీలోకి పంపి తర్వాత కేసీఆర్ కూడా బీజేపీలో తన పార్టీని విలీనం చేస్తారని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు మంత్రియా నాయక్, ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపీపీ రామనాథం, బల్మూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనంతరెడ్డి, పండిత్ రావు, హరి నారాయణ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీని వీడి దొంగలతో కలిసేటోళ్ల గురించి బాధలేదు.. రాష్ట్రం సాధించిన మనకు గిదో లెక్కనా..? : కేసీఆర్



హైదరాబాద్, జూన్ 28 : బీఆర్ఎస్ పార్టీని వీడి దొంగలతో కలిసేటోళ్ల గురించి బాధలేదు.. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మనకు గిదో లెక్కనా.. అని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పార్టీ కార్యకర్తల సమావేశం శుక్రవారం కూడా కొనసాగింది. కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల నుంచి వందలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. పార్టీయే నాయకులను తయారు చేస్తది తప్ప.. నాయకులు పార్టీని ప్రభావితం చేయలేరు. నాడైనా నేడైనా నాయకులను తయారు చేసుకున్నది పార్టీనే.. మెరికల్లాంటి యువ నాయకులను పార్టీ సృష్టిస్తది. రెట్టించిన ఉత్సాహంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేద్దాం. బీఆర్ఎస్ శ్రేణులకు ప్రస్తుత పరిస్థితులు ఒక లెక్క కాదు. ఒకరు పోతే 10 మంది నాయకులను పార్టీ తీర్చిదిద్దుకుంటుంది. తెలంగాణ ఆత్మను అర్థం చేసుకునే సత్తా.. బీఆర్ఎస్‌కు మాత్రమే ఉంది. కొన్ని సార్లు అబద్ధపు ప్రచారాలను నమ్మి ప్రజలు మోసపోతారు. మొన్నటి ఎన్నికల్లో అదే జరిగింది. మనం ఏ హోదాలో ఉన్న ప్రజల కోసం పని చేయాల్సిందే అని కేసీఆర్ స్పష్టం చేశారు.కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల నాయకులు, ప్రజలతో సమావేశం కంటే ముందు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నేతలతో కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డి, కోరుట్ల, హుజురాబాద్ ఎమ్మెల్యేలు డా. సంజయ్, కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జీవన్ రెడ్డి, జాజాల సురేందర్, గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, ఎల్ రమణ, జగిత్యాల జడ్పీ చైర్మన్ వసంత సురేష్, పెద్దపెల్లి బీఆర్ఎస్ నేత ఉష తదితరులు పాల్గొన్నారు.

# దశదినకర్మలో పాల్గొన్న మేకల మల్లిబాబుయాదవ్



ఖమ్మం, జూన్ 28 :(నేటినిజం ప్రతినిధి): కామేపల్లి మండలం బండిపాడు గ్రామంలో గుగులోతు కృష్ణ తండ్రి గుగులోతు శంకర్ అనారోగ్యంతో ఇటీవల మరణించారు. శుక్రవారం నాడు జరిగిన వారి దశదిన కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పాల్గొని చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించి అతని సేవలను కొనియాడారు.

శంకర్ మృతి తీరనిలోటని వారి ఆత్మకు శాంతి చేకూరాలని శంకర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి ఎల్లవేళలా అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో శీలం పుల్లయ్య, బానోత్ నరసింహారావు నాయక్, గుగులోతు లచ్చిరాం, గుగులోతు నాగేశ్వరరావు, గుగులోతు మంగ్యా, కురుసం రవి, గుగులోతు రవి, గుగులోతు శ్రీనివాసరావు, జాటోతు రామ, ముత్యబోయిన సత్యనారాయణ, గుగులోతు కిషన్, గుగులోతు బాసు, గూగుల్ పంతులు, జాటోద్ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

